
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
బుధవారం, 11.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 139
పేజీలు: 12 వెల: రూ. 5

# ఆపరేషన్ ఎటాక్
## మూసీ పాలిట్రిక్స్

- నది ప్రక్షాళనలో రాజకీయం
- బీఆర్ఎస్ ఎదురుదాడి
- డిఫెన్స్‌లో కాంగ్రెస్
- వేల కోట్ల ప్రచారంపై అనుమానాలు
- రంగంలోకి సీఎం రేవంత్
- అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్
- ఆరోపణలపై లీగల్ ఫైట్ చేసేందుకూ సిద్ధం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
మూసీ ప్రక్షాళన ఇప్పుడు రాజకీయ పార్టీల మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి దారి తీస్తోంది. ఇప్పటిదాకా ప్రతి అంశాన్ని బీఆర్ఎస్‌కు ముడిపెట్టిన కాంగ్రెస్.. మూసీపై మాత్రం నిజాలు దాస్తున్నట్టే మారింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై ప్రస్తుతం జరుగుతున్న రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తన వాదనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో వెనుకబడినట్లు కనిపిస్తోంది. భారీ ప్రాజెక్టులను చేపట్టినప్పుడు వాటి వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలను వివరించడంలో వైఫల్యం చెందితే, ప్రతిపక్షాలు కేవలం ఖర్చు ను మాత్రమే భూతద్దంలో చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మూసీ విషయంలో సరిగ్గా ఇదే జరుగుతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు అసలు లక్ష్యాలను వివరించడం కంటే, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇచ్చుకోవడానికే ఎక్కువ సమయం వెచ్చిస్తోంది. మిగతా 02లో




## గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు



- మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు
- పుష్కర ఏర్పాట్లపై కేబినెట్ సబ్ కమిటీ భేటీ
- సమన్వయంతో పని చేయాలని ఆదేశం

03

## బోగస్ ఏరివేత

- భూమి అమ్మేసినా.. ఐటీ చెల్లించినా సాయం పొందిన వేల మంది
- రైతుల జాబితా శుద్ధి.. 32 వేల మందికి లబ్ధి నిలిపివేత
- ఫార్మర్ ఐడీ నమోదు వేగం పెరగడంతో వెలుగులోకి అక్రమాలు

ఈకేవైసీతో బయటపడిన అక్రమ లబ్ధిదారులు
పీఎం కిసాన్‌లో అనర్హుల ఏరివేతకు కేంద్రం కఠిన చర్యలు




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
వ్యవసాయం చేసే రైతులకు ఆర్థికంగా అండగా ఉండేందుకు..కేంద్రం అమలు చేస్తోన్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ( పీఎం కిసాన్ ) పథకం తెలంగాణలో పక్కదారి పట్టింది. ఐటీ చెల్లింపుదారులు, భూమిని అమ్మేసినా, ఇతర అర్హతలేవీ లేకున్నా రాష్ట్రంలో 32 వేల మంది అక్రమంగా ఈ పథకం కింద లబ్ధిపొందినట్లు అధికారుల సర్వేలో తేలింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ పథకం ద్వారా మిగతా 02లో



## గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాలు

ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- మూడేళ్లలో అన్ని గ్రామాల్లో నిర్మిస్తాం
- శిశు విహార్‌లలో మోడ్రన్ కిచెన్ ఏర్పాట్లు
- కళారూపాలతో అవగాహన కార్యక్రమాలు

03

## ప్రభాకర్ రావుకు అరెస్ట్ నుంచి ఊరట

ఫోన్ ట్యాపింగ్ కేసులో 'సుప్రీం'ముందస్తు బెయిల్ మంజూరు




- సిట్ దర్యాప్తునకు సహకరించాలని ఆదేశాలు
- సాక్ష్యాలు, ఆధారాల ట్యాంపరింగ్ కు ప్రయత్నిస్తే బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరిక
- ట్రయల్ కోర్టు పర్మిషన్ లేకుండా ఎక్కడికీ వెళ్లొద్దని ఆదేశాలు

09

## రాజాసింగ్ రివర్స్ గేర్

మళ్లీ వస్తా.. ప్లీజ్




- ఆవేశంతో బీజేపీకి రాజీనామా.. రాజకీయ అవసరంతో మళ్లీ గూటికి
- అధ్యక్ష ఎన్నికల రగడతో మొదలైన విభేదాలకు ముగింపు
- ఇతర పార్టీల తలుపులు మూసుకుపోవడంతో బీజేపీ వైపు అడుగులు
- కఠిన షరతులతో రాజాసింగ్ రీ-ఎంట్రీకి హైకమాండ్ గ్రీన్ సిగ్నల్
- పాతబస్తీలో పార్టీ బలం కోసం రాజాసింగ్‌ను మళ్లీ ఆశ్రయించిన కమలం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
బీజేపీ వివాదాస్పద ఎమ్మెల్యే రాజాసింగ్ మళ్లీ బీజేపీలో చేరనున్నారు. కఠిన షరతులతో హైకమాండ్ చేర్చుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా గుర్తింపు పొందిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజకీయ ప్రస్థానం ఇప్పుడు ఒక విచిత్రమైన మలుపు తిరిగింది. ఆవేశంతో పార్టీకి దూరమై, ఇప్పుడు మళ్లీ అదే గూటికి చేరేందుకు అతి కష్టం మీద అనుమతి తెచ్చుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. మిగతా 02లో

## వసూళ్లు మీ ఇష్టమా..?

ట్యూషన్ ఫీజు మాత్రమే




- అదనంగా రూపాయి కూడా వసూలు చేయొద్దు
- ఇంజినీరింగ్ కాలేజీల అదనపు ఫీజులకు బ్రేక్
- రూ.8,500 స్పెషల్ ఫీజుకు ప్రభుత్వం చెక్
- స్టూడెంట్స్‌పై అదనపు భారం తగ్గించిన సర్కార్
- లైబ్రరీ, ల్యాబ్ పేర్లతో వసూళ్లు కుదరదు
- కాలేజీల ఇష్టారాజ్యానికి ఫీజుల నియంత్రణ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కాలేజీలకు టీఏఎఫ్ఆర్సీ కొత్త ఫీజులను ఖరారు చేసిన విషయం తెలిసిందే. అయితే.. ఈసారి ప్రభుత్వం జారీ చేసిన జీవోలో కేవలం ట్యూషన్ ఫీజును మాత్రమే అనుమతించి, గతంలో వసూలు చేసే రూ. 8,500 అదనపు 'స్పెషల్ ఫీజు'ను తొలగించడం కాలేజీ యాజమాన్యాలకు షాక్‌కు గురయ్యేలా చేసింది. అడ్మిషన్, లైబ్రరీ, ల్యాబ్ వంటి పేర్లతో ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేయడంతో విద్యార్థులకు భారం తగ్గనుంది. మిగతా 02లో



## వెల్ కమ్ సార్..

నూతన గవర్నర్ శివప్రతాప్ శుక్లా కు సీఎం రేవంత్ స్వాగతం

- శంషాబాద్ ఎయిర్ పోర్టులో భేటీ
- నేడు హైకోర్టు చీఫ్ జస్టిస్ చేతుల మీదుగా కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారం

09

## బిడ్డను అమ్మిన తండ్రి

మెదక్ జిల్లాలో అమానుష ఘటన వెలుగులోకి

- నెల రోజుల మగ శిశువును రూ.1.70 లక్షలకు విక్రయం
- తాగుడుకు బానిసైన తండ్రి దారుణం
- కామారెడ్డి జిల్లాలో గుర్తించిన పోలీసులు
- తండ్రి సహా ఆరుగురిపై కేసు నమోదు



03

## భూముల రీ-సర్వే కోసం ఆధునిక 'రోవర్ల' కొనుగోలు

ఒకే గొడుగు కిందికి కీలక విభాగాలు



- రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే కు ప్రత్యేక పోర్టల్
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

03




## కేంద్రం నిధులు దయ కాదు.. హక్కు

రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్

కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చొరవ తీసుకోవాలి

03




## రైతులపై కేసులు పెడితే సహించం

రైతుల అరెస్టుపై బండి సంజయ్ ఆగ్రహం



- వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- కాలువ పనులు ఎందుకు ఆలస్యం?
- 9,500 ఎకరాలకు నీరు అందే అవకాశం
- రంగనాయక్ సాగర్ ద్వారా సిరిసిల్లకు నీరివ్వని కేటీఆర్ రైతు ద్రోహి

09

## వరంగల్ అభివృద్ధికి చర్యలు

వరంగల్ నగరాభివృద్ధిపై మంత్రి పొంగులేటి సమీక్ష



- త్వరలో ఎంజీఎం హాస్పిటల్ ప్రారంభం
- అండర్ గ్రౌండ్ పనులకు శంకుస్థాపన
- యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

09

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 11.03.2026
www.mudranews.in | @mudranews





**వర్కవుట్‌కు ముందు**

**ఇలా చేయాలి**

వ్యాయామానికి 30-60 నిమిషాల ముందు తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది.

# ఆపరేషన్ ఎటాక్

(మొదటి పేజీ తరువాయి)

**విగ్రహం మీదుగా బీఆర్ఎస్**

ఖర్చు విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు సామాన్య ప్రజల్లోకి వేగంగా వెళ్తున్నాయి. కేవలం ఒక విగ్రహం కోసం, మ్యూజియం కోసం వేల కోట్లు తగలేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కానీ వాస్తవ గణాంకాలను పరిశీలిస్తే, గాంధీ విగ్రహం, దాని ప్లాట్ ఫారమ్ నిర్మాణానికి అవుతున్న ఖర్చు దాదాపు రూ. 96.4 కోట్లు మాత్రమే. మొత్తం రూ. 5,812 కోట్ల ప్రాజెక్టులో ఇది చాలా స్వల్ప భాగం. అయితే, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నుంచి నీటి శుద్ధి, మళ్లింపు, గండిపేట పరిసరాల అభివృద్ధి వంటి అత్యంత కీలకమైన పనులకు కేటాయించిన రూ. 3,676 కోట్లను ప్రభుత్వం ప్రజలకు అర్థమయ్యేలా వివరించలేకపోయింది. ఫలితంగా, ఇది కేవలం ఒక విగ్రహం ప్రాజెక్టు అనే ముద్ర పడిపోయింది.

**వివరణ ఇచ్చుకుంటున్న కాంగ్రెస్**

ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం వహిస్తున్న వ్యూహాత్మక మౌనం ఇప్పుడు ప్రతిపక్షాలకు అస్త్రంగా మారింది. ఏదైనా భారీ ప్రక్షాళన కార్యక్రమం చేపట్టినప్పుడు దానివల్ల వచ్చే పర్యాటక ఆదాయం, భూగర్భ జలాల పెరుగుదల, మురుగునీటి శుద్ధి వల్ల నగర ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలను డాక్యుమెంటరీల ద్వారా లేదా పబ్లిక్ ఫోరమ్స్ ద్వారా ప్రచారం చేయాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం పరిపాలనాపరమైన అనుమతులకే పరిమితమైంది. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రతిపక్షం, రూ. 1.5 లక్షల కోట్ల అంచనా వ్యయం గురించి పదే పదే మాట్లాడుతూ సామాన్య ప్రజల్లో ఇంత వృథా ఖర్చు అవసరమా? అనే అనుమానాన్ని రేకెత్తిస్తోంది. పారదర్శకత లోపించడం, క్షేత్రస్థాయిలో మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు భరోసా ఇవ్వడంలో విఫలం కావడం రేవంత్ సర్కార్‌కు ఇబ్బందికరంగా మారింది.

**విగ్రహ సెంటిమెంట్ రాజకీయమే**

తెలుగు రాష్ట్రాల్లో విగ్రహాలు కట్టిన ప్రభుత్వాలు మళ్ళీ అధికారంలోకి రాలేదనే సెంటిమెంట్ రాజకీయ వర్గాల్లో బలంగా ఉంది. మూసీ ప్రాజెక్టు మొత్తం కేవలం విగ్రహం చుట్టూ తిరగడం వల్ల ఈ సెంటిమెంట్ ఇప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారుతోంది. నిజానికి మూసీ సుందరీకరణ అనేది హైదరాబాద్ గ్లోబల్ ఇమేజ్‌కు, భవిష్యత్తు అవసరాలకు సంబంధించింది. కానీ, ప్రభుత్వం విదేశీ పర్యటనలు, కన్సల్టెన్సీల నియామకంపై చూపిస్తున్న శ్రద్ధ.. సామాన్యులకు ప్రాజెక్టు ప్రయోజనాలను వివరించడంలో చూపడం లేదు. ఒక అద్భుతమైన అభివృద్ధి ప్లాన్, సరైన కమ్యూనికేషన్ లేకపోవడం వల్ల రాజకీయ వివాదాల సుడిగుండంలో చిక్కుకోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా ప్రభుత్వం ఎదురుదాడి మాని, వాస్తవాలను గణాంకాలతో సహా ప్రజల ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది.

**సీఎం ఏం చెప్తున్నారు..?**

పేదల ఇళ్లు కూలగొట్టడం మా ప్రభుత్వ ఉద్దేశం కాదు. చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దాంతో, వర్షం వస్తే ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయి. నిత్యావసరాలు పాడై ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ సమస్యలు తొలగించేందుకే చెరువులు, నాలాల పునరుద్ధరణ చేపడుతున్నాం. ఇందుకు సహకరించాలి. చెరువులు, నాలాలు ఆక్రమించుకున్న పెద్దలు, మిత్రులు, శ్రేయోభిషులు కూడా సహకరిస్తే బాగుంటుంది'' అని సీఎం ఈ ప్రాజెక్టుపై పదేపదే చెప్తుతున్నారు. ''అహ్మదాబాద్‌లో సబర్మతి, ఢిల్లీలో యమున, ఉత్తరప్రదేశ్‌లో గంగ నదులను అభివృద్ధి చేసుకున్నారు. మూసీని మనం ఎందుకు అభివృద్ధి చేసుకోకూడదు!? మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఎందుకు చేసుకోకూడదో ప్రజలు ఆలోచించాలి. నదీ ప్రక్షాళనను అడ్డుకుంటే నగరానికి అన్యాయం చేసినట్టవుతుంది'' అని సీఎం స్పష్టంచేశారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాలు ఏదో ఓ సమస్యతో బాధపడుతున్నాయని, మన హైదరాబాద్ ఎంతో సురక్షిత నగరమని, దీన్ని మరింత పర్యావరణహితంగా మార్చేందుకు సహకరించాలని కోరారు. ''ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా పెరిగి నివసించలేని దుస్థితి నెలకొంది. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, చివరకు పార్లమెంట్‌కూ సెలవులిచ్చే పరిస్థితి వచ్చింది. ప్రధాని, రాష్ట్రపతి, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు వంటివి ఉన్న దేశ రాజధానిలో ముందుచూపు లేకపోవడం వల్లే ఈ దుస్థితి. ముంబైలో వాన పడితే ముంపు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య. చెన్నైలో అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు వస్తోంది. కానీ, తెలంగాణలో కోర్ అర్బన్ రీజియన్ వరకు 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. ఆ నగరాల్లా కాకుండా.. భవిష్యత్ తరాలకు ఇబ్బంది లేకుండా కోర్ పరిధిలో చెరువులు, నాలాల పునరుద్ధరణ, పార్కులు, క్రీడా మైదానాల అభివృద్ధి, రోడ్ల నిర్మాణం తో హైదరాబాద్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్దాం'' అని సీఎం పిలుపునిచ్చారు. మూసీ అభివృద్ధి, రోడ్ల విస్తరణ, వంతెనల నిర్మాణ క్రమంలో ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం ఇస్తామని, ఇళ్లు కోల్పోయే వారికి నివాసాలు కేటాయిస్తామని చెప్పారు.

**బీఆర్ఎస్ విమర్శలేంటి..?**

మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు తెలంగాణ రాజకీయాలకు ఇప్పుడు కేంద్ర బిందువుగా మారింది. నిర్వాసితుల నుంచి వ్యతిరేకత.. ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరాలు.. ప్రాజెక్టు వ్యయ అంచనాల్లో గందరగోళం సహా ఇలా అనేక అంశాల మధ్య మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఈ ప్రాజెక్టును దశల వారీగా చేపట్టనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా చాదర్ ఘాట్, మూసారాంబాగ్ ప్రాంతాల్లో నిర్వాసితుల తరలింపును ప్రభుత్వం చేపట్టింది. తాజాగా బీఆర్ఎస్ దీనిపై స్పీడ్ పెంచింది. అది లూటిఫికేషన్ అంటూ కేటీఆర్ ఫైర్ అవుతున్నారు. దీంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాల మధ్య విమర్శల యుద్ధం కొనసాగుతోంది. ఈ ప్రాజెక్ట్ పేరుతో కాంగ్రెస్ పార్టీ కుంభకోణానికి తెరతీసిందని బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో మూసీ ప్రాజెక్టు కన్సల్టెన్సీ విషయంలో బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపణలు చేసి చిక్కుల్లో పడ్డారు. తమపై నిరాధార ఆరోపణలు చేశారంటూ మన్నె క్రిశాంక్‌కు మెయిన్‌హర్ట్ సంస్థ లీగల్ నోటీసులు పంపింది. దురుద్దేశంతో తమ కంపెనీ ప్రతిష్ఠ దెబ్బతినేలా ఆరోపణలు చేశారని ఆ సంస్థ పేర్కొంది. క్రిశాంక్ తన వ్యాఖ్యలను 24 గంటల్లోపు ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలని.. ఎక్స్ (ట్విట్టర్) లో పెట్టిన పోస్టులను తొలగించాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో సివిల్, క్రిమినల్ పరంగా న్యాయపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

**రంగంలోకి రేవంత్ రెడ్డి..**

రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మూసీ రివర్ ఫ్రంట్ పునరుజ్జీవన ప్రాజెక్టు కీలక దశకు చేరుకుంది. ఈ ప్రాజెక్టుపై నెలకొన్న అపోహలను తొలగించి, పారదర్శకతను పెంచేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఈ నెల 13న తెలంగాణ అసెంబ్లీ వేదికగా ఈ ప్రాజెక్టుపై ఆయన పూర్తి వివరణతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (PPT) ఇవ్వనున్నారు.

**అసెంబ్లీలో సమగ్ర వివరణ**

మూసీ ప్రక్షాళన, అభివృద్ధిపై గత కొంతకాలంగా ప్రతిపక్షాల నుండి వస్తున్న విమర్శలు, ప్రజల్లో ఉన్న సందేహాలకు ఈ ప్రజెంటేషన్ ద్వారా చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రాజెక్టుకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR) ఇప్పటికే సిద్ధమైంది. దాని రూపురేఖలను ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలకు, రాష్ట్ర ప్రజలకు వివరించనున్నారు. లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మూసీ నదిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు.

**నిర్వాసితులకు భరోసా**

నదీ పరివాహక ప్రాంతాల్లోని నిర్వాసితుల పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. వారికి కల్పించే ప్రత్యామ్నాయ వసతులు, పరిహారంపై స్పష్టత ఇవ్వనున్నారు. మూసీ మురుగు నీటిని శుద్ధి చేయడం, నది చుట్టూ పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటంపై ప్రభుత్వం కార్యాచరణను వివరించనుంది. హైదరాబాద్ నగరం ముఖచిత్రాన్ని మార్చే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. కేవలం నదిని శుభ్రం చేయడమే కాకుండా, నది వెంట వాణిజ్య, వినోద మరియు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం దీని ముఖ్య ఉద్దేశ్యం. రూ. వేల కోట్ల బడ్జెట్‌తో చేపట్టబోయే ఈ బృహత్తర ప్రాజెక్టుపై సీఎం ఇవ్వబోయే ప్రజెంటేషన్ ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది.


# బోగస్ ఏరివేత

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిపొందుతోన్న రైతుల జాబితా నుంచి ఈ 32వేల మంది పేర్లను తొలిగించడంతో పాటు వారికి అందుతోన్న సాయాన్ని నిలిపివేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అనర్హుల ఏరివేత ప్రక్రియను ప్రారంభించారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఏటా మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలను రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. 2018-19 సంవత్సరంలో ప్రారంభమైన ఈ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 21 విడతలుగా.. దేశవ్యాప్తంగా ఉన్న అర్హులైన రైతుల అకౌంట్లలో రూ.14,237.05 కోట్లను వేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించిన గణాంకాలు చెబుతున్నాయి. పీఎం కిసాన్ యోజన ప్రారంభించిన కొత్తలో కేంద్ర ప్రభుత్వం 20.28 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసింది. ఆ తర్వాత 2021–22 డిసెంబర్ నాటికి 10వ విడతలో భాగంగా పథకం లబ్ధిదారుల సంఖ్య అమాంతం 36.07 లక్షలకు పెరిగింది. అప్పటి నుంచి ఏటా లబ్ధిదారుల సంఖ్య పెరగడంతో ఏటా అనర్హుల జాబితాను గుర్తించి.. వారిపై చర్యలు చేపట్టింది. 15వ విడత నాటికి ఈ లబ్ధిదారుల సంఖ్య 28.71 లక్షలకు పడిపోయింది. మధ్యలో కొన్నేళ్ల పాటు అధికారులు ఫోకస్ చేయకపోవడంతో మళ్లీ ఆ సంఖ్య పెరిగింది. చివరగా ఈ పథకంలో భాగంగా 21వ విడతలో దేశంలోని 30.08 లక్షల మంది అకౌంట్లలో డబ్బులు జమ చేశారు. అయితే ఇందులో అనర్హులను గుర్తించి వారి పేర్లను తొలగించనున్నారు. ఇందులో భాగంగానే ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 32 వేల మంది రైతులు అనర్హులుగా ఉన్నట్లు గుర్తించిన కేంద్రం.. వారికి అందించే సాయాన్ని కట్ చేయనున్నారు. చాలా మంది తమ భూములను అమ్ముకున్నారని.. మరికొందరు ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తూనే ఏటా రూ.6 వేల నగదును కేంద్రం నుంచి అందుకుంటున్నారని గుర్తించారు. ఇలాంటి అనర్హులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం 10 శాతం మంది లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి.. అనర్హులుగా తేలిన వారికి సాయాన్ని నిలిపివేస్తోంది.

**బయటపడిందిలా..**

పీఎం కిసాన్ పథకం కింద డబ్బులు పొందే రైతులు కచ్చితంగా ఈ–కేవైసీ చేయించుకోవాలనే రూల్ పెట్టడంతో చాలా మంది అనర్హులను గుర్తించి.. వారికి సాయాన్ని నిలిపివేశారు. ఆధార్ కార్డును లింక్ చేయడంతో ఇన్‌కమ్ ట్యాక్స్, అధికంగా భూమిని కలిగి ఉన్న వారు.. కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరికీ పీఎం కిసాన్ రావడంతో వారంతా బయట పడి.. అనర్హులు అయ్యారు. ఇప్పటికీ చాలా మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోకపోవడంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు.. గతేడాదిలో ఫార్మర్ ఐడీ రిజిస్టర్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా




ఆ ప్రక్రియ 70 శాతం కూడా చేరుకోలేదు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు ప్రతీ గ్రామానికి తిరిగి పరిశీలించగా.. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు మాత్రమే ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తేలింది. 6 ఎకరాలకు పైగా ఉన్న రైతులు మాత్రం ముందుకు రావడం లేదని స్పష్టమైంది. ఈ నేపథ్యంలోనే 10 రోజులుగా వ్యవసాయ శాఖ అధికారులు లబ్ధిదారుల జాబితాను చెక్ చేస్తున్నారు. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, చనిపోయిన వారు, భూమిని అమ్మేసినవారు, 5 ఎకరాలకు పైబడిన కుటుంబాల్లో ఇద్దరూ లేదా అంతకంటే ఎక్కువ మంది లబ్ధి పొందితే వారికి ఇప్పటి నుంచి పీఎం కిసాన్ సాయం జమ కాదని అధికారులు స్పష్టం చేశారు.

# మళ్లీ వస్తా.. ప్లీజ్



(మొదటి పేజీ తరువాయి)

**అధ్యక్ష పదవి రగడ - ఆవేశం తెచ్చిన ముప్పు**

గత ఏడాది తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలు రాజాసింగ్ రాజకీయ జీవితంలో పెను ప్రకంపనలు సృష్టించాయి. రామచందర్ రావును అధ్యక్షుడిగా ఎంపిక చేయడాన్ని నిరసిస్తూ, పాతబస్తీ శైలిలో రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం విమర్శలతో ఆగకుండా, తాను కూడా అధ్యక్ష పదవికి నామినేషన్ వేస్తానని పట్టుబట్టారు. అయితే, నిబంధనల ప్రకారం కనీసం 10 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్ల మద్దతు లేకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో అవమానంగా భావించిన రాజాసింగ్, ఆవేశంతో తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన ఊహించని విధంగా, పార్టీ అధిష్టానం కూడా ఎటువంటి బుజ్జగింపులు లేకుండా తక్షణమే ఆ రాజీనామాను ఆమోదించి షాక్ ఇచ్చింది.

**రాజకీయ శూన్యత - ఇతర పార్టీల్లో నో ఎంట్రీ**

బీజేపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత రాజాసింగ్ ఒక రకమైన రాజకీయ శూన్యతను ఎదుర్కొన్నారు. ఆయనకున్న హిందుత్వ ఇమేజ్ కారణంగా అటు కాంగ్రెస్ గానీ, ఇటు బీఆర్ఎస్ గానీ ఆయనను చేర్చుకోవడానికి ఆసక్తి చూపలేదు. తనకంటూ ఒక ప్రత్యేక ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ, ఒంటరి పోరాటం చేయడం లేదా స్వతంత్రుడిగా మిగిలిపోవడం వల్ల రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన గ్రహించారు. ఏ గూటి పక్షి ఆ గూటికే చేరాలి అన్న సామెత చందంగా, ఇతర పార్టీల నుంచి సానుకూల స్పందన లేకపోవడం, సొంత కేడర్ నుంచి వస్తున్న ఒత్తిడి కారణంగా ఆయన మళ్లీ బీజేపీ వైపు చూడక తప్పలేదు.

**అధిష్ఠానం షరతులు**

ప్రస్తుతం రాజాసింగ్ బీజేపీలోకి మళ్లీ రాబోతున్నారనే వార్తలకు గ్రీన్ సిగ్నల్ రావడం వెనుక భారీ కసరత్తు జరిగినట్లు తెలుస్తోంది. గతంలో మాదిరిగా పార్టీ లైన్ దాటి ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకూడదని, క్రమశిక్షణ తప్పకూడదని అధిష్టానం గట్టిగా హెచ్చరించినట్లు సమాచారం. ముఖ్యంగా ఢిల్లీ పెద్దల నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాతే రాష్ట్ర నాయకత్వం ఆయనకు మార్గం సుగమం చేసింది. పాతబస్తీలో బీజేపీ జెండా ఎగరాలంటే రాజాసింగ్ వంటి బలమైన వాయిస్ అవసరమని గుర్తించిన హైకమాండ్, ఈసారి ఆయనను ఒక లిమిటెడ్ ఫ్రేమ్ లో ఉంచాలని నిర్ణయించుకుందని చెబుతున్నారు.

**కానీ రాజాసింగ్ మారుతారా?**

ఈ రీ–ఎంట్రీ రాజాసింగ్‌కు ఒక రకమైన రాజకీయ పునర్జన్మ వంటిదే. పార్టీలో తన పట్టును నిరూపించుకోవాలంటే గతంలో చేసిన ఆవేశపూరిత పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకోవడం ఆయనకు అతిపెద్ద సవాలు. అటు బీజేపీకి కూడా రాబోయే మున్సిపల్, లోకల్ బాడీ ఎన్నికల్లో రాజాసింగ్ దూకుడు అవసరం. రాజాసింగ్–బీజేపీ బంధం రెండో ఇన్నింగ్స్‌కు సిద్ధమైంది. ఈసారి రాజాసింగ్ తన టైగర్ ఇమేజ్‌ను కాపాడుకుంటూనే పార్టీకి ఎలా విధేయుడిగా ఉంటారో వేచి చూడాలి.

## గల్ఫ్ దేశాల్లో కుప్పకూలుతున్న

# రియల్ ఎస్టేట్



**ముద్ర డెస్క్ :**

ఇరాన్ –అమెరికా యుద్ధం గల్ఫ్ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. యుద్ధానికి కారణం కాకపోయినా.. బాధితులవుతున్న పరిస్థితి గల్ఫ్ దేశాలది. ఎన్నో ఏళ్ల శ్రమతో నిర్మించుకున్న పేరు, ఖ్యాతి తుడిచిపెట్టుకుపోతోంది. బిలియనీర్లు, పెట్టుబడిదారులు గల్ఫ్ దేశాలను వదలుతున్నారు. స్థిరమైన దేశాల వైపు పయనిస్తున్నారు. ఇది గల్ఫ్ దేశాలకు కోలుకోలేని దెబ్బ. దీని తీవ్రత ఇంకా ఎంత ఉండబోతుందో తెలియదు. కానీ ఏళ్ల కష్టం ఒక్క యుద్ధంతో కనుమరుగవుతోంది. గల్ఫ్ దేశాలను పెట్టుబడిదారులు, బిలయనీర్లు సేఫెస్ట్ ప్రాంతంగా చూస్తారు. అందుకే ఎక్కువగా పెట్టుబడులు పెడతారు. నివాసం ఏర్పరుచుకుంటారు. వాస్తవంగా గల్ఫ్ దేశాల ఆర్థిక నిర్మాణం ఆయిల్ ద్వారా జరిగింది. ఆయిల్ తో వచ్చిన ఆదాయాన్ని టూరిజం అభివృద్ధికి ఖర్చు చేశారు. టూరిజాన్ని అభివృద్ధి చేశారు. ఆ తర్వాత ఫైనాన్స్ ను మరో ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. టూరిజం అభివృద్ధి, గల్ఫ్ దేశాల్లో విదేశీయులకు ఉన్న భద్రత కలగలిపి గల్ఫ్ దేశాలను భద్రమైన ప్రాంతంగా మార్చాయి. ఫలితంగా రియల్ ఎస్టేట్ పుంజుకుంది. విదేశీయులే ముఖ్యంగా గల్ఫ్ దేశాల రియల్ ఎస్టేట్ ఎదుగుదలకు కారణం. కానీ ఇప్పుడు ఆ రియల్ ఎస్టేట్ నేలచూపులు చూస్తోంది. ఇరాన్ ఇప్పటి వరకు దాదాపు వెయ్యి డ్రోన్లు, మిసైళ్లను గల్ఫ్ దేశాలపై ప్రయోగించింది. ఫలితంగా ప్రపంచంలోనే సేఫెస్ట్ ప్రాంతం ఒక్కసారిగా అశాంతి, అభద్రతతో అల్లాడుతోంది. అబుదాబిలోని అల్–జుబైల్ లో ఫోర్ బెడ్ రూమ్ ఫ్లాట్ ధర రూ. 7.3 కోట్లు తగ్గినట్టు వార్తలు వస్తున్నాయి. బిలియనీర్లు, పెట్టుబడిదార్లు గల్ఫ్ దేశాలకు ప్రత్యామ్నాయంగా సింగపూర్ ను ఎంచుకుంటున్నారు. ఇది గల్ఫ్ దేశాల భవిష్యత్తును దెబ్బతీస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దాడుల కారణంగా టూరిజం తగ్గుముఖం పడుతుంది. ఫలితంగా గల్ఫ్ దేశాలు ఆదాయాన్ని కోల్పోతాయి. మరోవైపు విదేశీ వర్కర్లను కూడా పనుల్లో కొనసాగించలేని పరిస్థితి. వారిని కూడా సొంత దేశాలకు పంపాల్సి ఉంటుంది. ఇది కూడా గల్ఫ్ దేశాల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. మొత్తంగా ఒక దాని తర్వాత మరొకటి యుద్ధం కారణంగా ప్రభావితమవుతాయి. యుద్ధం ఎక్కువ కాలం జరగకపోవచ్చు. కానీ గల్ఫ్ దేశాలకున్న పేరు, ఖ్యాతి మాత్రం చెరిగిపోయింది. ఇక ఎవరూ.. గల్ఫ్ దేశాలను సేఫెస్ట్ ప్రాంతమని అనలేరు. ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ మధ్య యుద్ధానికి దారితీసే పరిస్థితులు సమసిపోనంత వరకు గల్ఫ్ దేశాలకు ఇరాన్ నుంచి ముప్పు తప్పదు. ఇరాన్ ముప్పు ఉన్నంత కాలం సేఫెస్ట్ ప్రాంతాలు కావు. యుద్ధం చేయకపోవడం గల్ఫ్ దేశాల అడ్వాంటేజ్. అయితే యుద్ధానికి బాధితులయ్యి తమకున్న రెప్యూటేషన్ ను గల్ఫ్ దేశాలు కోల్పోవలసి వస్తోంది. ఒక్కోసారి అడ్వాంటేజ్ కూడా డిస్ అడ్వాంటేజ్ గా మారుతుందని చెప్పడానికి గల్ఫ్ దేశాలే ఉదాహరణ. యుద్ధానికి దూరంగా ఉండి సేఫెస్ట్ ప్రాంతంగా పేరు తెచ్చుకుని, పెట్టుబడులు తీసుకొచ్చిన గల్ఫ్ దేశాలకు.. అదే మైనస్ గా మారింది.

# వసూళ్లు మీ ఇష్టమా..?

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోని ఇంజినీరింగ్‌తో పాటు ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, లా, బీఈడీ, కాలేజీలకు తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ)ఇటీవల వార్షిక ఫీజులు ఖరారు చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి మూడేళ్ల పాటు ఇవే ఫీజులు కొనసాగనున్నాయి. తాజాగా.. ఆయా కాలేజీలకు సర్కార్ ఊహించని షాక్ ఇచ్చింది. అనేక కాలేజీలకు ఫీజు పెంచకపోవడంతో పాటు కొన్ని కాలేజీలకు ఇప్పటి వరకు ఉన్న ఫీజునే తగ్గించిన విషయం తెలిసిందే. కొన్ని కాలేజీలకు అయితే దాదాపు సగానికి పైగా ఫీజు తగ్గించారు. అదే సమయంలో ఈసారి ట్యూషన్ ఫీజు తప్ప.. ఇతర పేర్లతో రూపాయి కూడా విద్యార్థుల నుంచి వసూలు చేయడానికి వీల్లేదని కొత్త ఫీజుల జీవోల్లో రేవంత్ సర్కార్ స్పష్టం చేసింది.

**గతంలో వారిష్టమే**

గతంలో ట్యూషన్ ఫీజుతోపాటు బీటెక్‌కు వివిధ రకాల పేరిట స్టూడెంట్స్ నుంచి అదనంగా రూ.8,500 వరకు వసూలు చేసుకునే వీలుండేది. అందులో రూ.2 వేలు కాలేజీలు విశ్వవిద్యాలయాలకు చెల్లించాల్సి ఉండేది. ఫీజుల ఖరారు జీవోలో ప్రత్యేక ఫీజులను కూడా పొందుపరిచేవారు. అయితే ఈసారి జీవోల్లో వాటి ప్రస్తావన ఎక్కడా లేదు. ట్యూషన్ ఫీజులో స్పెషల్ ఫీజు, అడ్మిషన్ ఫీజును చేర్చలేదని ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని టీఏ ఎఫ్ఆర్‌సీ కోరినట్లు జీవోలో ఉంది. అయితే విద్యాశాఖ వర్గాలు మాత్రం తమకు టీఏఎఫ్ఆర్‌సీ ప్రతిపాదించిన ఫీజులనే ఖరారు చేశామని చెబుతున్నాయి. ప్రత్యేక రుసుములను సిఫార్సు చేయలేదని పేర్కొంటున్నాయి. ప్రత్యేక ఫీజులపై ఉన్నతాధికారులతో చర్చించి స్పష్టతనిస్తామని టీఏఎఫ్ఆర్‌సీ వర్గాలు వ్యాఖ్యానించాయి. గతంలో అధికారికంగా బీటెక్ విద్యార్థుల నుంచి ఆయా కాలేజీలు రకరకాల పేర్లు చెప్పి రూ. 8,500 చొప్పున వసూలు చేయవచ్చు. కానీ అనధికారికంగా రూ.12–16 వేల వరకు పలు బీటెక్ కాలేజీలు వసూలు చేస్తుండేవి. ప్రతి ఏడాది కనీసం రూ.25 కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకు అనదంగా వసూలు చేసేవారు. ఇతర కోర్సులను కూడా కలిపితే ఆమొత్తం రూ.100 కోట్లు పైమాటే. ఈ నేపథ్యంలో ఈ సారి కొత్త ఫీజులను ఖరారు చేసే ముందు విద్యాశాఖ, టీఏఎఫ్ఆర్‌సీ వర్గాలు చర్చలు జరిగాయి. ట్యూషన్ ఫీజు తప్ప.. మిగిలినవి వసూలు చేయటానికి వీల్లేదని డిసైడ్ అయి ఈ మేరకు జీవో విడుదల చేశారు.

**ఇప్పుడు కఠినం**

విద్యార్థులు కాలేజీల్లో ప్రవేశం పొందేటపుడు రిజిస్ట్రేషన్ పేరిట రూ.2 వేలు చెల్లించాలి. అందులో రూ. 500 కాలేజీల యాజమాన్యం విశ్వవిద్యాలయానికి చెల్లిస్తుంది. రీడింగ్ రూం, కళాశాల మేగజైన్, ప్రయోగశాల, గ్రంథాలయ రుసుం, కంప్యూటర్, ఇంటర్‌నెట్, క్రీడలు, కళాశాల ఉత్సవాలు, ప్రాంగణ నియామకాలు తదితరాలకు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. కాలేజీలకు విశ్వవిద్యాలయం కామన్ సర్వీస్ అందించేందుకు రూ.1500 చెల్లించాలి. అలాగే పరీక్షలకు సంబంధించిన పాఠ్య ప్రణాళిక మార్పు, వెబ్ సైట్ నిర్వహణ, అధ్యాపకుల శిక్షణ తదితర సేవలకు వాటిని వసూలు చేస్తారు. లైబ్రరీ, ప్రయోగశాల డిపాజిట్ కింద రూ.1000 చెల్లించాలి. వాటిని కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థికి చెల్లించేవారు. కాలేజీల్లోని కోర్సులకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు ఉంటే ప్రవేశాల సమయంలో ట్యూషన్ రుసుముకు అదనంగా ఏడాదికి మరో రూ.3 వేలు చెల్లించాల్సి ఉండేది. ప్రస్తుతం వీటిపై జీవోలో స్పష్టత ఇవ్వేలేదు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
11.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వర్కవుట్‌కు**
కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం మంచిది

బనానా, ఓట్స్, బ్రెడ్ వంటి కార్బ్స్ ఉన్న ఆహారం తీసుకుంటే వ్యాయామ సమయంలో ఎనర్జీ తగ్గదు.



# గోదావరికి ఆధ్యాత్మిక శోభ

- పుష్కరాలకు ఏర్పాట్లు
- కందకుర్తి నుంచి భద్రాచలం వరకు ఘాట్లు
- అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
- మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు
- పుష్కర ఏర్పాట్లపై కేబినెట్ సబ్ కమిటీ భేటీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7 వరకు తెలంగాణలో జరగనున్న గోదావరి పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని 2027 గోదావరి పుష్కరాల నిర్వహణ కేబినెట్ సబ్ కమిటీ శ్రీధర్ బాబు, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పుష్కర ఏర్పాట్లలో రోడ్లు భవనాలు శాఖ కీలక భూమిక పోషించనుందని వివరించారు. ఈ పుష్కరాలను అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో 2027 గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. వచ్చే ఏడాది రాబోయే గోదావరి పుష్కరాలను భక్తులకు సౌకర్యవంతంగా, భద్రంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారి సౌకర్యాలు, తాగునీరు, పారిశుధ్యం, రవాణా మరియు ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై ఆయా శాఖల సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. గోదావరి నది మహారాష్ట్రలో పుట్టినా.. నది పరివాహకం ఎక్కువ తెలంగాణలో ఉంటుందని మంత్రి చెప్పారు. నిజామాబాద్ జిల్లా కందకుర్తిలో మొదలై భద్రాచలం వరకు ఈ నది ప్రవహిస్తుందని చెప్పారు. ఈ వందల కిలోమీటర్ల ప్రాంతంలో ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాలు(బాసరా, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచలం) ఎంతో చరిత్ర కలిగిన గుడులు ఉన్నాయని వివరించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ అన్ని విధాల ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్న కోమటిరెడ్డి.. హ్యామ్ మోడల్ రోడ్లు కనెక్టివిటీతో పాటు, అవసరమైన కాంక్రీట్ రోడ్లు, పుష్కర ఘాట్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తుందని వివరించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. అవసరమైన పుష్కర ఘాట్లు, ఘాట్లకు వెళ్ళే రహదారులు, మౌళిక సదుపాయాలు పై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా వాహనాల రాకపోకలు, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌పై దృష్టి సారించాలనీ అందుకు సంబంధించి అన్ని విభాగాల అధికారులు, పోలీసు యంత్రాగం సమన్వయంతో వచ్చే మీటింగ్ నాటికి ఒక రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కోట్ల మంది భక్తులు పుణ్య స్నానా లు ఆచరించే పవిత్ర గోదావరిని తెలంగాణ గంగా నదిగా పిలుచుకుంటామని చెప్పారు. కాబట్టి రానున్న పుష్కరాలు అంతే స్థాయిలో నిర్వహించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## యాదగిరిగుట్ట హుండీ లెక్కింపు

- రూ.1 కోటి 86 లక్షల ఆదాయం



**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి 28 రోజుల హుండీ ఆదాయం 1 కోటి 86 లక్షల 44 వేల 511 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జే. భవాని శంకర్ తెలిపారు. మంగళవారం ఉదయం నుండి కొండ కింద వ్రత మండపంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. లెక్కింపులో మిశ్రమ బంగారం 57 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, మిశ్రమ వెండి 2 కిలోల 750 గ్రాములు వచ్చినట్లు చెప్పారు. విదేశీ కరెన్సీ అమెరికా329 డాలర్లు, ఇంగ్లాండ్ 40 పౌండ్స్, కెనడా 160 డాలర్లు, దిరామ్స్ 70, నేపాల్ 45, ఆస్ట్రేలియా 30, యూరోప్ 5, రియాల్ 3, హాంకాంగ్ 510, బెహ్రీన్ 1, ఇండోనేసియా 1000. వియత్నాం 3,01,000. సౌత్ ఆఫ్రికా 50. మలేషియా 10, బ్రెజిల్5 బక్షలు కానుక రూపంలో ఆదాయంగా సమకూరినట్లు చెప్పారు.



## ఒకే గొడుగు కిందికి కీలక విభాగాలు

- భూముల రీ-సర్వే కోసం ఆధునిక 'రోవర్ల' కొనుగోలు
- రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే కు ప్రత్యేక పోర్టల్
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించడానికి రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం ఒక ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. రాష్ట్రంలో భూ లావాదేవీలను మరింత పారదర్శకంగా నిర్వహించి, ప్రజలకు ముఖ్యంగా రైతులకు అత్యుత్తమ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన 2026-27 బడ్జెట్ సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పిస్తూ మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, అత్యాధునిక 'రోవర్' పరికరాలతో భూముల సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు.ఇప్పటికే మండలానికి ఒకటి చొప్పున 460 రోవర్లను కొనుగోలు చేశామన్న ఆయన వచ్చే బడ్జెట్‌లో మరో 400 రోవర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో నక్షా (మ్యాప్) లేని 373 గ్రామాల్లో త్వరలోనే రీ-సర్వే చేపట్టబోతున్నామనీ ఇందుకు సంబంధించి 2026-27 బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత ప్రభుత్వ భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా పరిపాలన సౌలభ్యం కోసం వీటికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రెవెన్యూ, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొని శాఖల వారీగా నిధుల అవసరాలపై చర్చించారు.

## మగ శిశువును అమ్మేసిన తండ్రి

- ఆరుగురిపై పోలీసు కేసు నమోదు



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
కన్న తండ్రే 30 రోజుల శిశువును అమ్మేశాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలంలోని ఓ తండాకు చెందిన నెల మగ శిశువును విక్రాయించిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం కంజర్ల గ్రామంలో శిశువు ఉన్నట్టు గుర్తించి రాత్రి అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకున్న మగ శిశువు (బాలుడి), తల్లిని మెదక్ పట్టణంలోని సఖి కేంద్రానికి మంగళవారం తెల్లవారు జామున తరలించారు. డబ్బుల కోసం తన భర్తే వేరొకరికి అమ్మినట్టు శిశువు తల్లి పోలీస్ అధికారులకు తెలిపింది.

**అరుగురిపై కేసు నమోదు:**
శిశువు విక్రయానికి సంబంధించి వివరాలను మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ మీడియాకు వెల్లడించారు. హవెలి ఘనపూర్ (మం) లింగసానిపల్లికి చెందిన ఓ వ్యక్తికి గత ఏడాది రెండో వివాహం జరిగింది. గత నెల ఫిబ్రవరి 10న మెదక్ ఎంసిహెచ్ లో మగ శిశువుకు తల్లి జన్మనిచ్చిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, తాగుడుకు బానిసై కన్నా తండ్రి కన్నా కుమారున్ని విక్రయించాడని తెలిపారు. 5 లక్షలకు బేరం పెట్టిన కన్నా తండ్రి అగ్రిమెంట్ రాసుకుని రూ.1,70 లక్షలకు విక్రయించినట్లు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాకు చెందినా సంతానం లేని దంపతులు శిశువును కొనుగోలు చేశారన్నారు. శిశు విక్రయంపై ఫిర్యాదు రావడంతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి విచారణ చేపట్టినట్లు వివరించారు. ఇందుకు సంబంధించి అరుగురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో సీఐ జార్జ్, హవెలి ఘనపూర్ ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

## పంచాయతీలకు శాశ్వత భవనాలు

- ఉన్నత స్థాయికి తెలంగాణ టూరిజం
- అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కోర్సులు
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో శాశ్వత భవనాలు లేని గ్రామ పంచాయతీలు అన్నిటికి శాశ్వత భవనాలు నిర్మించాలని ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్ లతో కలిసి ఆయా శాఖల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. స్థలాలు అందుబాటులో ఉన్న చోట తాసిల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నారుల మెదడు బలంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టిక ఆహారంతో పాటు బోధనా పద్ధతులతో వారికి తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. పట్టణాల్లో రహదారుల పైన కొంతమంది చంటి బిడ్డలను పెట్టుకొని యాచక వృత్తి కొనసాగిస్తున్నారు వారందరినీ శిశు విహార్ లో తీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్లపై చంటి బిడ్డలు పట్టపగలు ఎండకు, వర్షాకాలంలో వానకు తడిసి వారి విలువైన బాల్యం మసకబారి పోతుందని ఆ విధంగా జరగడానికి అవకా శం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం తెలిపారు. శిశు విహార్ లో మోడ్రన్ కిచెన్ నిర్మించాలని సూచించారు. ఉపాధి కల్పించే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు రూపొందించాలని, గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఎంఓయు కుదుర్చుకున్న కంపెనీలను సంప్రదించి అందుకు అనుగుణంగా ఏటిసి సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. క్యూర్, ప్యూర్ రేర్ పాలసీకి అనుగుణంగా వచ్చే పరిశ్రమలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలని, స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేసుకోవాలని సమంత అధికారులను ఆదేశించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారా మాత్రమే జరగాలని ఈ క్రమంలో ఏజెన్సీలకు ఐటీడీఏల నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందించాలని వారిని ఆర్థికంగా బలోపేతం చేసి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులకు సూచించారు. కవ్వాల్, శ్రీశైలం వంటి టైగర్ జోన్లు అభివృద్ధి చేసుకోవాలని పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో, టెంపుల్ టూరిజం ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు యువతను చైతన్యం చేయాలని, డ్రగ్స్ వినియోగం ద్వారా జరిగే నష్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపించే విధంగా గ్రామస్థాయిలో కళా రూపాలు ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా కళాకారులకు జీవనోపాధి కలగడంతో పాటు సమాజంలో మంచి మార్పు కనిపిస్తుందని అన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీసీఎల్ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అనిత రామచంద్రన్, దివ్య దేవరాజ్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, గృహ నిర్మాణ శాఖ సెక్రటరీ గౌతం, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## అవయవ మార్పిడిలో ఆదర్శంగా నిలవాలి

### మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
అవయవ మార్పిడి చికిత్సలో తెలంగాణ దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణను రూపొందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్యా శాఖఆధికారులను ఆదేశించారు. అవయవ దానాలను ప్రోత్సహించే విధి విధానాలను సరళీకృతం చేయాలని సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ ఆక్ట్ పాలసీ రూపకల్పనపై, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమీక్షలో అవయవ మార్పిడి చికిత్సలపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సల ధరలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులకు సైతం అవయవ మార్పిడి చికిత్సలకు అయ్యే ఖర్చును భరించే విధంగా ధరల నియంత్రణ ఉండాలని ప్రైవేట్ యాజమాన్యాలకు సూచించారు. ఇతర దేశాల నుండి ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం వచ్చే రోగుల కోసం నూతన విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అవయవ మార్పిడి చికిత్సలకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో చెయ్యి మార్పిడి చికిత్స కోసం నాలుగు ఆస్పత్రులకు అనుమతులు ఇచ్చామన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ చేసిన సూచనలకు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సానుకూలంగా స్పందించగా దాతలు ఇచ్చిన అవయవాలు వృథా కాకుండా ఆస్పత్రులు ప్రత్యేక చర్యలను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర కుమార్, జీవన్ దాన్ డైరెక్టర్ డా. భూషణ్ రాజ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## దయ కాదు.. హక్కు

- తెలంగాణ ప్రజలు పన్నులు చెల్లిస్తుంటే..
- కేంద్ర నిధులు ఎందుకివ్వరూ..?
- రాష్ట్రాలపై వివక్ష తగదు
- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చొరవ తీసుకోవాలి
- పెండింగ్ ప్రాజెక్టులు సాధించాలి
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
కేంద్రం నుంచి వచ్చే నిధులు కేంద్రం దయ కాదు.. తెలంగాణ హక్కు అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తెలంతగాణ ప్రజలు కేంద్రానికి పన్నులు చెల్లిస్తున్నప్పుడు ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం కేంద్రం చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో జరుగుతున్న కేంద్ర బడ్జెట్ చర్చలో తెలంగాణకు సంబంధించి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్ట్ లపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు చర్చించాలన్నారు. మంగళవారం కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి పొన్నం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో వివక్ష చూపొద్దని డిమాండ్ చేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ కు ప్రతి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తున్నారనీ అయితే తాము దానిని వ్యతిరేకించడం లేదన్నారు. కానీ ఆ రాష్ట్రానికి కేటాయిస్తున్న బడ్జెట్‌లో సగం నిధులైన కేంద్రం తెలంగాణకు ఇవ్వాలన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య స్ఫూర్తిని లక్ష్యాన్ని గౌరవిస్తూ రాష్ట్రాలకు పన్నుల వాటలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**రాష్ట్రాలపై భారం**
కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్రం తన వాటాను తగ్గించుకుంటోందని పొన్నం ఆరోపించారు. తద్వారా రాష్ట్రాల మీద భారాలు మోపుతున్నారనీ ఇది సరికాదన్నారు. కేంద్ర ప్రయోజిత పథకాల్లో కేంద్ర వాటా 90 శాతం ఉండే విధంగా పునరుద్ధరించాలన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి, సామాజిక పెన్షన్లు గత పదిహేనులుగా నామమాత్రంగా ఇస్తున్నారని ఆరోపించారు. 12 ఏండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క పెద్ద ప్రాజెక్ట్ కూడా ఇవ్వలేదన్నారు. దేశ ఆర్థిక వృద్ధికి కీలకంగా దోహదపడుతున్న తెలంగాణకు ఈ బడ్జెట్ లోనూ చేయడం లేదని విమర్శించారు. విభజన చట్టం హామీలు అమలు చేయడంలో కేంద్రం దారుణంగా విఫలమైందని తెలంగాణకు ఐఐఎం, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఊసు లేదు. ఒక్క ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం చేయడం లేదన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
11.03.2026 బుధవారం, హైదరాబాద్



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744



# కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు

## సంక్షోభంలో ఎల్పీజీ సరఫరా

మధ్యప్రాచ్య ప్రాంతంలో అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఎల్పీజీ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థలో మధ్యప్రాచ్యం కీలక పాత్ర పోషిస్తుంది. అక్కడ ఏర్పడే ప్రతి ఉద్రిక్తత అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై వెంటనే ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ ఇంధన వ్యవస్థకు పెద్ద సవాలుగా మారింది. ఎల్పీజీ అనేది ముడి చమురు శుద్ధి ప్రక్రియలో.. సహజ వాయువు ఉత్పత్తిలో లభించే ముఖ్య ఉపఉత్పత్తి. అందువల్ల ముడి చమురు ధరల పెరుగుదల, సహజ వాయువు ఉత్పత్తిలో అంతరాయాలు, సముద్ర రవాణా మార్గాల్లో భద్రతా సమస్యలు ఎల్పీజీ సరఫరా, ధరలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం ముడి చమురు ధరలు పెరగడం ఒకవైపు ఉండగా, సముద్ర మార్గాల్లో రవాణాకు అంతరాయం మరోవైపు మార్కెట్‌పై ఒత్తిడిని పెంచుతోంది. ప్రపంచ ఎల్పీజీ రవాణాలో అత్యంత కీలకమైన మార్గం హర్మూజ్ జలసంధి. ప్రపంచ ఎల్పీజీ రవాణాలో సుమారు 40 శాతం ఈ మార్గం ద్వారానే జరుగుతుంది. ఈ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు క్షీణించడంతో అనేక గ్యాస్ ట్యాంకర్లు ప్రయాణాలను ఆలస్యం చేయడం లేదా తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతోంది. దీంతో సరఫరా వ్యవస్థలో అనిశ్చితి పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌పై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దేశంలో వినియోగించే ఎల్పీజీలో సుమారు 85 శాతం దిగుమతులపై ఆధారపడుతోంది. ముఖ్యంగా ఖతర్, సౌదీ అరేబియా వంటి మధ్యప్రాచ్య దేశాల నుంచే ఎక్కువగా దిగుమతులు వస్తాయి. కాబట్టి సముద్ర రవాణాలో అంతరాయం కలిగితే దేశీయ సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంది. కొంతకాలానికి సరిపడే నిల్వలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ సరఫరా ఎక్కువకాలం నిలిచిపోతే సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్పీజీ ధరలు కూడా పెరుగుతున్నాయి. సౌదీ ఆరంకో ధరలు పెరగడం, యుద్ధ ప్రమాద బీమా మరియు రవాణా ఖర్చులు పెరగడం వల్ల మొత్తం సరఫరా వ్యయం అధికమవుతోంది. దీని ప్రభావం చివరకు వినియోగదారులపై ధరల రూపంలో పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో దేశీయ సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించడం అత్యంత అవసరం. వినియోగదారులు, డిస్ట్రిబ్యూటర్లు, ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలి. అవసరానికి మించి నిల్వలు చేయడం, అనవసర భయాందోళనలు సృష్టించడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తుంది. యుద్ధ పరిస్థితులు కొనసాగితే గ్యాస్ సిలిండర్ల సరఫరాలో కొంత జాప్యం సంభవించే అవకాశం ఉంది. అలాంటి సందర్భాల్లో సహనం, అవగాహన మరియు సమన్వయం అవసరం. దేశంలోని కోట్లాది కుటుంబాల వంటింటిని ప్రభావితం చేసే ఈ సమస్యలో ప్రభుత్వం తీసుకునే చర్యలు కీలకంగా మారనున్నాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న ఈ పరిస్థితుల్లో బాధ్యతాయుత వ్యవహారం ద్వారానే సమస్యలను అధిగమించగలం.

పింగళి వేంకటేశ్వర రావు
జాతీయ అధ్యక్షులు,
భారత ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం
9866033333



# సురక్షిత జలాలే.. ఆరోగ్య జీవనానికి ఆధారం!

## నేడు ప్రపంచ ప్లంబింగ్ దినోత్సవం



ప్రతి సంవత్సరం మార్చి 11న ప్రపంచవ్యాప్తంగా వరల్డ్ ప్లంబింగ్ డేను జరుపుకుంటారు. ఈ దినోత్సవాన్ని వరల్డ్ ప్లంబింగ్ కౌన్సిల్ ప్రారంభించింది. ప్రపంచ ప్రజలకు శుభ్రమైన నీటి సరఫరా, పరిశుభ్రత, పారిశుధ్య వ్యవస్థల ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. నీరు మన జీవనానికి అత్యంత అవసరమైన సహజ వనరు. అందువల్ల నీటిని సురక్షితంగా సరఫరా చేయడం, మురుగు నీటిని సక్రమంగా బయటకు పంపించడం చాలా ముఖ్యమైన పని. ఈ బాధ్యతను ప్రధానంగా ప్లంబింగ్ వ్యవస్థలు నిర్వహిస్తాయి. ఇళ్లలో, పాఠశాలల్లో, ఆసుపత్రుల్లో, కార్యాలయాల్లో నీటి పైపులు అమర్చడం, ట్యాంకులు ఏర్పాటు చేయడం, డ్రైనేజ్ వ్యవస్థలను నిర్వహించడం వంటి పనులు ప్లంబింగ్‌లో భాగం. ప్లంబింగ్ వ్యవస్థల వల్ల మనకు తాగునీరు అందుతుంది. మురుగు నీరు సురక్షితంగా బయటకు వెళ్లి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి. ప్లంబింగ్ వ్యవస్థలు పురాతన కాలం నుంచే ఉన్నాయి. రోమన్లు, ఈజిప్టియన్లు నీటి సరఫరా కోసం కాలువలు, పైపులు నిర్మించారు. గోల్కొండ కోటలో కూడా మట్టి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా వ్యవస్థ కనిపిస్తుంది. కాకతీయుల కాలంలో పాకాల, లక్కవరం చెరువులు త్రవ్వించి తాగునీరు, సాగునీరు అందించినట్లు చరిత్ర చెబుతోంది. శుభ్రమైన నీరు అందకపోతే కలరా,



టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. కాబట్టి సురక్షిత నీటి సరఫరా ఎంతో అవసరం. ప్లంబింగ్ వ్యవస్థలు ఈ సమస్యలను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అలాగే పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడేందుకు కూడా ఇవి సహాయపడతాయి.ప్లంబర్లు సమాజానికి ముఖ్యమైన సేవ అందిస్తున్నారు. నీటి పైపులు అమర్చడం, లీకేజీలు సరిచేయడం, డ్రైనేజ్ వ్యవస్థలను నిర్వహించడం వంటి పనుల ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన జీవితం కల్పిస్తున్నారు. అందువల్ల వారి సేవలను గౌరవించాలి.ప్రపంచంలో నీటి కొరత పెరుగుతున్న నేపథ్యంలో నీటిని జాగ్రత్తగా వినియోగించడం చాలా అవసరం. పైపుల్లో లీకేజీలు ఉంటే వెంటనే సరిచేయడం, అవసరానికి మించి నీటిని వృథా చేయకుండా ఉండడం అవసరం. సరైన ప్లంబింగ్ వ్యవస్థలు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రపంచ ప్లంబింగ్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు నీటి సంరక్షణ, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. శుభ్రమైన నీరు ప్రతి మనిషి హక్కు. కాబట్టి నీటిని సంరక్షించడం, మంచి ప్లంబింగ్ వ్యవస్థలను నిర్వహించడం మనందరి బాధ్యత.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752,హైదరాబాద్.



## కలాల కూర్పులు

కలాలు అల్లిన పదునైన అక్షరాలు —
పగిలిన మౌనాలను పలికిస్తాయి,
నిద్రలో ఉన్న నిజాలను
నిగర్విగా నిలబెడతాయి.
కలాలు వాడిన పదునైన పదాలు —
పొరలైన అబద్ధాలను తొలగిస్తాయి,
మాయమాటల ముసుగులను
మెల్లగా చీల్చి చూపిస్తాయి.
కలాలు తెలిపిన పదునైన భావాలు —
మనసుల మర్మాలను తడిమేస్తాయి,
నిర్లిప్తంగా నిలిచిన హృదయాల్లో
నిజం మంటలు రాజేస్తాయి.
కలాలు వదిలిన పదునైన మాటలు —
సమాజపు మలినాలను కడుగుతాయి,
సత్యపు కాంతిని
సర్వదిక్కులా పరచుతాయి.
కలాలు కూర్చిన పదునైన రాతలు —
కాలపు చెక్కిళ్లపై చెక్కుతాయి,
కాలుష్యపు గోడలపై
కవిత్వపు కిరణాలు చిమ్ముతాయి.
కలాలు కదిలితే —
కుర్చీలు కూడా కదులుతాయి,
కలాలు పదునెక్కితే —
కప్పుకున్న ముసుగులు జారిపోతాయి.
కలం వ్రాతలు కళ్ళను కట్టిపడేస్తాయి,
కలం చేతలు కనువిప్పు కలిగిస్తాయి;
కలం మోతలు కర్ణాలకు కమ్మదనమిస్తాయి,
కలం పోతలు కలనామృతం కురిపిస్తాయి.



గుండ్లపల్లి
రాజేంద్ర ప్రసాద్,
భాగ్యనగరం.

# ఆలోచనలే విజయానికి తొలి అడుగు

డా. మహ్మద్ హసేన


మనిషి జీవితాన్ని తీర్చిదిద్దేది కేవలం పరిస్థితులు కాదు; అతని ఆలోచనలు. పరిస్థితులు మన జీవితానికి ఒక వేదికను అందిస్తాయి కానీ ఆ వేదికపై ఎలా నడవాలో నిర్ణయించేది మన ఆలోచనలే. ఒక మంచి ఆలోచన జీవితం దిశను పూర్తిగా మార్చగలదు; అదే ఒక చెడు ఆలోచన మన ముందున్న అవకాశాల దారిని మూసివేయగలదు. అందుకే ఆలోచనలు మన వ్యక్తిత్వానికి, ప్రవర్తనకు, భవిష్యత్తుకు మార్గదర్శక శక్తిగా నిలుస్తాయి. మనం ఎలా ఆలోచిస్తామో, మన జీవితం కూడా ఎక్కువగా అలా రూపుదిద్దుకుంటుంది.నేటి వేగవంతమైన ప్రపంచంలో యువత అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. లక్ష్యాలపై అయోమయం, సమయాన్ని సరైన విధంగా వినియోగించలేకపోవడం, ఆత్మవిశ్వాస లోపం, సోషల్ మీడియా ప్రభావం వల్ల దృష్టి చెల్లాచెదురవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో డా. మహ్మద్ హసేన రచించిన "మీ ఆలోచనలే మిమ్మల్ని నిర్దేశిస్తాయి" అనే పుస్తకం ప్రధానంగా యువతను దృష్టిలో పెట్టుకుని రాసినప్పటికీ, జీవిత దిశను పునరాలోచించాలనుకునే ప్రతి పాఠకుడికి ఇది ఉపయోగపడే గ్రంథంగా నిలుస్తుంది.ఆలోచనల్లో చిన్న మార్పు వచ్చినా జీవితం మొత్తం మారిపోతుందనే నమ్మకాన్ని ఈ గ్రంథం బలంగా వ్యక్తం చేస్తుంది.ఈ పుస్తకం కేవలం ప్రేరణాత్మక సందేశాల సమాహారం మాత్రమే కాదు; అది పాఠకుడిని తనలోకి తీసుకెళ్లే ఒక ఆత్మపరిశీలన ప్రయాణం. ప్రతి మనిషి తనను తాను ప్రశ్నించుకోవాల్సిన విషయాలను రచయిత సరళమైన భాషలో వివరించారు. వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, సమయ నిర్వహణ, లక్ష్యసాధన, జీవన విలువలు, కెరీర్ దిశ వంటి అంశాలను స్పష్టంగా వివరించడం ద్వారా పాఠకుడిలో ఆలోచనా స్పష్టతను పెంపొందించేలా ఈ గ్రంథం రూపుదిద్దుకుంది. చదువుతున్న కొద్దీ పాఠకుడిలో తన జీవితంపై కొత్త అవగాహన పెరుగుతుంది; తాను ఎటు వెళ్లాలి, ఎలా ముందుకు సాగాలి అనే ప్రశ్నలకు సమాధానాలు కనబడతాయి. పుస్తకం మొత్తం ఏడు అధ్యాయాలుగా విభజించబడింది. ప్రతి అధ్యాయం ఒక ప్రత్యేక భావన చుట్టూ తిరుగుతూ పాఠకుడిని ఆత్మపరిశీలన నుంచి ఆత్మవికాసం వైపు నడిపిస్తుంది. రచయిత ప్రతీ అంశాన్ని చిన్న చిన్న ఉదాహరణలు, అనుభవాలు, ఆలోచనాత్మక వ్యాఖ్యలతో వివరించడం ఈ గ్రంథానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. మొదటి అధ్యాయం మనలోని విలువను గుర్తించమని పిలుపునిస్తుంది. "మీ విలువ మీకు తెలుసా", "మీ ఆలోచనలే మిమ్మల్ని నిర్దేశిస్తాయి", "మీ మెదడు చెత్తబుట్ట కాదు" వంటి వ్యాసాలు వ్యక్తిలోని ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తూ, మనసులోకి అనవసర ఆలోచనలను నింపుకోవడం ఎంత ప్రమాదకరమో గుర్తు చేస్తాయి. మన మెదడు ఒక విలువైన సాధనం; దాన్ని చెత్తబుట్టలా ఉపయోగించకుండా, సానుకూల ఆలోచనలతో నింపితేనే మన జీవితానికి సార్థకత వస్తుందని రచయిత చెబుతారు. రెండవ అధ్యాయం భయం, ఆత్మవిశ్వాసం, వైఫల్యం వంటి జీవన సత్యాలను విశ్లేషిస్తుంది. చాలా మంది తమ సామర్థ్యాన్ని గుర్తించక ముందే భయంతో వెనుకడుగు వేస్తారని రచయిత సూచిస్తారు. భయం మనసులో పుట్టే ఒక భావన మాత్రమే; దాన్ని ధైర్యంగా ఎదుర్కొంటే అదే విజయానికి మెట్టుగా మారుతుందని రచయిత ఉదాహరణలతో వివరిస్తారు. అదే సమయంలో ఆత్మవిశ్వాసం మరియు అహంకారం మధ్య ఉన్న సున్నితమైన తేడాను కూడా రచయిత చక్కగా చూపించారు. ఆత్మవిశ్వాసం మనిషిని ముందుకు నడిపిస్తే, అహంకారం అతన్ని ఒంటరిగా మిగిల్చేస్తుందని ఈ అధ్యాయం స్పష్టంగా తెలియజేస్తుంది. మూడవ అధ్యాయం జీవితం అనే ప్రయాణంలో ఎదురయ్యే అవరోధాలు, కష్టాలు, శ్రమ ప్రాముఖ్యతను చర్చిస్తుంది. విజయం అనేది యాదృచ్ఛికంగా వచ్చేది కాదు; క్రమశిక్షణతో కూడిన కృషి, పట్టుదల, సహనం అనే మూడు మూలాధారాలపై నిర్మితమయ్యే ఫలితం అని రచయిత స్పష్టం చేస్తారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలను చూసి వెనుదిరిగే వారు కాదు, వాటిని మెట్టులుగా మార్చుకునే వారే నిజమైన విజేతలు అవుతారని ఈ భాగం పాఠకుడికి ప్రేరణనిస్తుంది.నాలుగో మరియు ఐదో అధ్యాయాలు జీవన విలువలు, స్నేహం, కుటుంబ బంధాలు, లక్ష్యసాధన వంటి అంశాలను స్పృశిస్తాయి.మనిషి జీవితంలోకుటుంబంఎంతముఖ్యమో రచయిత భావోద్వేగంగా వివరిస్తారు. తల్లి ప్రేమ, తండ్రి త్యాగం, స్నేహబంధాల విలువ వంటి భావాలను హృద్యంగా చిత్రించారు. మన విజయానికి వెనుక నిలిచే ఈ బంధాలను గుర్తించకుండా ముందుకు సాగడం అసంపూర్ణ జీవితం అవుతుందని రచయిత సూచిస్తారు.అహంకారంమనిషినిఒంటరిగాచేస్తుందని,వినయం అతన్నిమరింత ఉన్నతంగానిలబెడుతుందని ఈభాగంగుర్తు చేస్తుంది. ఆరవ అధ్యాయం సమయపాలన, సానుకూల ఆలోచనల ప్రభావం, కష్టపడి పనిచేయాల్సిన అవసరాన్ని చర్చిస్తుంది. సమయం తిరిగి రాని సంపద అని రచయిత స్పష్టంగా చెబుతారు. దాన్ని వృథా చేసినవారు తర్వాత పశ్చాత్తాపపడతారు; సద్వినియోగం చేసుకున్నవారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారు. సమయాన్ని విలువైన వనరుగా భావించి క్రమబద్ధంగా వినియోగిస్తేనేలక్ష్యాలను చేరుకోవచ్చని ఈ అధ్యాయం తెలియజేస్తుంది.సంపాదనలోతెలివితేటలతో పాటు నైతిక విలువలు కూడా అవసరమని రచయిత గుర్తుచేస్తారు. చివరి అధ్యాయం యువతకు సమగ్ర కెరీర్ మార్గదర్శకంగా నిలుస్తుంది. పరీక్షలపై అవగాహన, ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యే విధానం, సాఫ్ట్ స్కిల్స్ ప్రాముఖ్యత, పదవ తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ఉన్న అవకాశాలపై స్పష్టమైన వివరాలు ఇవ్వడం ఈ భాగానికి ప్రత్యేకత. నేటి పోటీ ప్రపంచంలో కెరీర్ ఎంపికలోస్పష్టత ఎంత ముఖ్యమో రచయిత వివరించారు. ఈ కారణంగా ఈ అధ్యాయం ఒక "కెరీర్ హ్యాండ్‌బుక్"లా కూడా ఉపయోగపడుతుంది. మొత్తంగా "మీ ఆలోచనలే మిమ్మల్నినిర్దేశిస్తాయి"అనేఈగ్రంథం పాఠకుడిని కేవలం చదవమని కాదు, ఆలోచించమని ఆహ్వానిస్తుంది.వ్యక్తిత్వవికాసం, మానసిక బలం, విలువల పరిరక్షణ, కెరీర్ స్పష్టత అనే నాలుగు స్తంభాలపై నిర్మితమైన ఈ గ్రంథం యువతకు ఒక దిక్సూచి వంటిది. చదివే ప్రతి వ్యక్తిలో ఒక కొత్త ఆలోచనను రగిలించే శక్తి ఈ పుస్తకానికి ఉంది.జీవితంలో గమ్యం కోసం వెతుకుతున్న ప్రతి ఒక్కరికీ ఈ పుస్తకం ఒక ఆలోచనల దీపంలా మార్గం చూపుతుంది. ఇది చదివి ముగించేసే పుస్తకం కాదు; చదివిన తర్వాత మనలో మార్పు తీసుకొచ్చే పుస్తకం. ఆలోచనల్లో చిన్న వెలుగువెలిగితేనేజీవితంకొత్తదిశలోసాగుతుంది అనే సత్యాన్ని ఈ గ్రంథం స్పష్టంగా తెలియజేస్తుంది. "మీ ఆలోచనలే మిమ్మల్ని నిర్దేశిస్తాయి" పుస్తకాన్ని కావలసినవారు 9908059234నంబర్‌కు సంప్రదించవచ్చు.



గాజోజి శ్రీనివాస్
9948483560.








వర్కవుట్‌కు ప్రోటీన్ కూడా కొద్దిగా ఉండాలి

వర్కవుట్‌కు ముందు కొద్దిగా ప్రోటీన్ తీసుకోవడం వల్ల కండరాలకు బలం లభిస్తుంది.



## రోడ్డును బాగు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

**ముద్ర, తాండూర్ :**

తాండూర్ పట్టణ పరిధిలోని 7వ వార్డు హైదరాబాద్ రోడ్ నుండి ఎన్టీఆర్ కాలనీ వరకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి అధ్వాన స్థితికి చేరింది. గత పాలకుల నుంచి నేటి వరకు అనేకమంది ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా సమస్యకు పరిష్కారం లభించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రధాన రహదారి గుండా వందల సంఖ్యలో వాహనదారులు, బాటసారులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఇదే ప్రధాన మార్గం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు తెలిపారు. ఈ రహదారి సమస్యను మంగళవారం తాండూర్ శాసనసభ్యులు మనోహర్ రెడ్డి దృష్టికి హరిహర టౌన్షిప్ కాలనీవాసులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే హైదరాబాద్ రోడ్ నుండి ఎన్టీఆర్ కాలనీ వరకు త్వరలోనే బీటీ రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సంసద్ ఖేల్ మహోత్సవ పోస్టర్ల విడుదల

**ముద్ర, నారాయణపేట :**

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ తెలిపారు. ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ పోస్టర్ల విడుదల కార్యక్రమాన్ని డోకూరు తిరుపతిరెడ్డి అధ్యక్షతన మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 9 నుంచి 24 వరకు పార్లమెంట్ పరిధిలో ఐదు రకాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా క్రీడాకారులు తమ ఆట పేరు, వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం నారాయణపేట జిల్లా కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథిగా ఎంపీ డీకే అరుణతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటాలని కోరారు. అనంతరం క్రీడాకారుల రిజిస్ట్రేషన్ కోసం క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రతంగ్, కౌన్సిలర్లు సత్య రఘుపాల్, కమలాపూర్ ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు పోశల్ వినోద్, రఘురామయ్య గౌడ్, లక్ష్మీ శ్యాంసుందర్, మిర్చి వెంకటయ్య, బిల్డర్ వెంకట్ రాములు, సుంకు ఉమేష్, రఘువీర్, సాయి బన్న, డగే కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సూపరింటెండెంట్‌పై నర్సింగ్ సిబ్బంది ఫిర్యాదు

**ముద్ర, తాండూర్ :**

వికారాబాద్ జిల్లా తాండూర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వినయ్ కుమార్‌పై నర్సింగ్ సిబ్బంది వేధింపుల ఆరోపణలు చేస్తూ తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న నర్సింగ్ సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వికారాబాద్ జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ ఆనంద్‌తో మాట్లాడి విషయాన్ని తెలుసుకున్నారు. అనంతరం పరిస్థితిపై నిజనిర్ధారణ జరిపించాలని సూచించారు. ఈ నేపథ్యంలో వినయ్ స్థానంలో సీనియర్ వైద్యులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మూర్తిని తాండూర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

## పనిచేసే కార్యకర్తలకే ప్రాధాన్యం

**ముద్ర, వనపర్తి :**

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నికార్సైన కార్యకర్తలకు సముచిత గౌరవం లభిస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి తెలిపారు. టీపీసీసీ అధిష్టానం ఆదేశాల మేరకు నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుల కార్యవర్గానికి సంబంధించిన సమావేశాన్ని మంగళవారం పెద్దమందడి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డితో కలిసి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. మండల, గ్రామ, బూత్ అధ్యక్షులకు సముచిత స్థానం ఇచ్చి గౌరవించనున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుల కార్యవర్గానికి త్వరలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ నందిమల్ల యాదయ్య, మాజీ డీసీసీ అధ్యక్షుడు రాజేందర్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మొగిలి సత్యారెడ్డి, కోట్ల రవి, మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, సీనియర్ నాయకులు తిరుపతయ్య, ఎంపీపీ శంకర్, గోవర్ధన్ సాగర్, జిల్లా యూత్ అధ్యక్షుడు ఆదిత్య, పాండు సాగర్, సర్పంచులు, మండల పార్టీ నాయకులు పెంటన్న, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ముస్లింలకు బట్టల పంపిణీ

**ముద్ర, మల్కాజిగిరి :**

మల్కాజిగిరి గౌతమ్ నగర్ 182వ డివిజన్ పరిధిలోని ఇంద్ర నెహ్రూ నగర్‌లో పవిత్ర రంజాన్ మాసం ఉపవాసాల సందర్భంగా ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. మసీదులో పేద ముస్లిం కుటుంబాలకు బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు, మాజీ మంత్రి మైనంపల్లి హనుమంతరావు మార్గదర్శకత్వంలో నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, గౌతమ్ నగర్ 182వ డివిజన్ అధ్యక్షుడు వైనాల ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ మైనార్టీ సెల్ సీనియర్ నాయకుడు ఎండి ఫరీద్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కపిల్, శ్రీకాంత్ యాదవ్, మల్కాజిగిరి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చరణ్ తదితరులు పాల్గొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా పేదలకు సహాయం చేయడం ఎంతో సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

## బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి

**ముద్ర, కుత్బుల్లాపూర్ :**

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు బాచుపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ ఉమా మహేశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ. 20వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అదేవిధంగా వివిధ సామాజిక వర్గాలకు ఆర్థిక సహాయాలు, చేతివృత్తులకు ప్రోత్సాహకాలు వంటి పలు హామీలు ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో ప్రవేశపెట్టనున్న తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ. 55వేల కోట్లు కేటాయించి, బీసీ డిక్లరేషన్ హామీలను నిజాయితీగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఇందిరమ్మ కాలనీ డివిజన్ కార్యదర్శి పొన్నకంటి దస్తగిరి పాల్గొన్నారు.

# నాడు కబ్జాల నిలయం.. నేడు పర్యాటక కేంద్రం

**నల్ల చెరువు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి**

**ముద్ర, కూకట్‌పల్లి :**



"హైదరాబాద్ నగరాన్ని వరద ముప్పు నుంచి కాపాడటమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. కబ్జాదారుల కోరల్లో చిక్కిన జలవనరులను కాపాడి, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని నల్ల చెరువు పునరుద్ధరణ పనులను పూర్తి చేసిన అనంతరం ఆయన గంగా హారతి ఇచ్చి ఈ సరస్సును ప్రజలకు అంకితం చేశారు. గతాన్ని గుర్తుచేసుకుంటూ తాను మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో నిధుల కొరత వల్ల ఈ ప్రాంతాన్ని ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని, ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఆ బాధ్యతను పూర్తి చేస్తున్నందుకు గర్వంగా ఉందని సీఎం తెలిపారు. ఒకప్పుడు 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్ల చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో కబ్జాల నుంచి విముక్తి కలిగించి 30 ఎకరాలకు విస్తరించామని చెప్పారు. అక్రమ నిర్మాణాలను తొలగించి, సిల్ట్ తొలగించడం ద్వారా చెరువుకు పూర్వవైభవం తీసుకొచ్చిన తీరును ఆయన కొనియాడారు. నగరంలోని చెరువులను కేవలం జలవనరులుగానే కాకుండా 'లేక్ ఎకానమీ జోన్లు'గా అభివృద్ధి చేస్తామని సీఎం వెల్లడించారు. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మహిళా సంఘాల సభ్యులు పాలు, పండ్లు, కూరగాయలు విక్రయించుకునేలా స్టాళ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చెరువుల పరిరక్షణ క్రమంలో ఇళ్లు కోల్పోయే పేదవారికి అన్యాయం జరగనివ్వబోమని సీఎం హామీ ఇచ్చారు. బాధితులకు 2బిహెచ్‌కే ఇళ్లు, తగిన పరిహారం లేదా టీడీఆర్ కల్పిస్తామని తెలిపారు. భవిష్యత్తు తరాల కోసం మూసీ ప్రక్షాళన, చెరువుల పునరుద్ధరణ అనివార్యమని పేర్కొన్నారు. "ఎన్నికల సమయంలోనే రాజకీయం ఉండాలి, ఎన్నికల తర్వాత అభివృద్ధిపైనే దృష్టి పెట్టాలి" అని అధికారులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. నల్ల చెరువు విస్తీర్ణాన్ని 16 ఎకరాల నుంచి 30 ఎకరాలకు పెంచడంతో పాటు వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ఎనిమిది ఇన్‌లెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మురుగు నీరు చేరకుండా డైవర్షన్ పనులు పూర్తి చేశామని, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్ మరియు చిన్నారుల కోసం ప్లే ఏరియాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ బ్రాండ్‌గా ఇప్పపూల సారా..!

- **జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్య**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రతినిధి :**



రాష్ట్రంలో ఇప్పపూలతో తయారు చేసే సారాను గ్లోబల్ బ్రాండ్‌గా అభివృద్ధి చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. దీనిపై అసెంబ్లీలో గళం విప్పుతానని తెలిపారు. రసాయనాలతో తయారు చేసే కల్తీ సారా గురించి తాను మాట్లాడటం లేదని, అడవుల్లో సహజంగా లభించే ఇప్పపూలతో తయారు చేసే సారాను మాత్రమే ప్రోత్సహించాలని కోరుతున్నానని స్పష్టం చేశారు. మంగళవారం జడ్చర్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పపూలతో తయారయ్యే సారాను తెలంగాణ బ్రాండ్‌గా తీర్చిదిద్దాలని, తద్వారా ప్రభుత్వానికి అలాగే ఆదివాసీ, గిరిజనులకు ఆదాయం పెరగాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. ఇప్పపూల సారా గురించి మాట్లాడటం తన వ్యక్తిగత ఆలోచన అని, గిరిజనుల ఉపాధి కోసం మాత్రమే దీనిని అసెంబ్లీలో ప్రస్తావించాలని నిర్ణయించుకున్నానన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సారాపై చేసిన వ్యాఖ్యలకు ఎమ్మెల్యే ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. ఇప్పపూలతో సారా తయారీ మన దేశంలో వేల ఏళ్లుగా కొనసాగుతోందని, బ్రిటిష్ పాలనలో వారి మద్యం విక్రయాల కోసం ఈ సంప్రదాయాన్ని నిలిపివేసినట్లు తెలిపారు. విదేశాల్లో మన ఇప్పపూల సారాకు సమానంగా టకీలా వంటి సంప్రదాయ మద్యాన్ని తయారు చేసి ఆయా దేశాలు భారీ ఆదాయం పొందుతున్నాయని చెప్పారు. అలాగే చైనా, జపాన్ దేశాలు తమ సంప్రదాయ మద్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా విక్రయిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా సాంప్రదాయ ఇప్పసారాను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రానికి భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉందని, ముఖ్యంగా నల్లమల సహా అటవీ ప్రాంతాల్లో లభించే ఇప్పపూల సేకరణ ద్వారా ఆదివాసీ, గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. అయితే తాను కల్తీ సారా గురించి మాట్లాడటం లేదని మరోసారి స్పష్టం చేశారు. ఇప్పసారా అంశంపై అసెంబ్లీలో చర్చించి అవసరమైన సవరణలు చేసుకుంటామని తెలిపారు. కొన్ని మీడియా సంస్థలు తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకొని ప్రభుత్వం సారా అమ్మాలని తాను చెప్పినట్లు ప్రచారం చేయడం వాస్తవం కాదని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.

## విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

**ముద్ర, కూకట్‌పల్లి :**

రానున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పురస్కరించుకుని యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లను పంపిణీ చేశారు. ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, శంషిగూడ ప్రభుత్వ పాఠశాలలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ మరియు జ్యామెట్రీ బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, తద్వారా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి కిట్లను అందజేసిన ఫౌండేషన్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, గుడ్ల శ్రీనివాస్, భాస్కర్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టి గౌడ్, ఖలీమ్ పాల్గొన్నారు. అలాగే యువ ఫర్ తెలంగాణ స్టేట్ కన్వీనర్ గవ్వల భరత్ కుమార్, బీసీఎస్ఎఫ్ నేషనల్ సెక్రటరీ మరియు హైదరాబాద్ కన్వీనర్ రుద్ర అభిరామ్ గౌడ్, 'సేవ్ ది ఎర్త్ ఫ్రం ఎటూ జెడ్ వీ ఆర్ వన్' వరల్డ్ మిషన్ సొసైటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మల్లికార్జున స్వామి జాతర

**ముద్ర, కూకట్‌పల్లి :**

కూకట్‌పల్లిలో వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి జాతర మహోత్సవం మంగళవారం గొల్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా గొల్ల కురుమ సంఘం సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజేశ్వరరావు జాతర ఉత్సవాలను పరిశీలించి భక్తులతో కలిసి కొద్దిసేపు గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆలయాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. ఇలాంటి పుణ్యక్షేత్రాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది" అని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు వేద ఆశీర్వచనాలతో వడ్డేపల్లి రాజేశ్వర రావును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గొల్ల కురుమ సంఘం నాయకులు నగేష్ యాదవ్, నర్సింగ్ రావు, నర్సింగ్ యాదవ్, గోపాలకృష్ణ కురుమ, మల్లేష్ యాదవ్, చైతన్య యాదవ్, మనమ్మ, మల్లమ్మ, లలిత, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



## చెరువుల పరిశుభ్రతకు 99 రోజుల యాక్షన్ ప్లాన్

**- ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**

**ముద్ర, కాప్రా :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చెరువుల పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా చెరువు పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, పొదలను తొలగించే కార్యక్రమాన్ని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజ్‌కు చెందిన విద్యార్థులు, పారిశుధ్య మరియు ఎంతమాలజీ విభాగపు సిబ్బంది కలిసి దాదాపు 125 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ నీటి వనరులను సంరక్షించడం, చెరువులను పరిశుభ్రంగా ఉంచడం ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డీఈ రవి, సానిటరీ సూపర్వైజర్లు, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఈఈలు, డీఈలు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు, యూబీడీ విభాగపు సిబ్బంది, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

**- కలెక్టర్ దీపక్ తివారి**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, కుటుంబం నుంచి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నారని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. మంగళవారం మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను కలెక్టరేట్‌లోని సమావేశ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు విద్య, ఉపాధి, ఆరోగ్యం మరియు స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు. సమాజంలో మహిళలకు గౌరవం, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మహిళల అభివృద్ధి ద్వారా సమాజం మరింత బలపడుతుందన్నారు. మన తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 13 మంది మహిళలు కలెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. యూపీఎస్సీ ఫలితాల్లో కూడా మహిళలు అధిక శాతం సాధిస్తున్నారని చెప్పారు. మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరని, ముఖ్యంగా క్రీడా రంగంలో కూడా మహిళల ప్రతిభ విశేషమని అన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశా వర్కర్లు మరియు ఇతర మహిళా సిబ్బంది సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అంతకుముందు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, హెల్త్ క్యాంప్‌లను కలెక్టర్ సందర్శించారు. కంటి, గుండె, చర్మ వ్యాధి నిపుణులతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి ఇప్పటివరకు ఎంతమందికి పరీక్షలు నిర్వహించారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు చేయించుకున్న వారి పేర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సంబంధిత వైద్యులకు ఆదేశించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి మాట్లాడుతూ మహిళా సాధికారత అంటే స్త్రీలు తమ జీవిత నిర్ణయాలను స్వయంగా తీసుకునే స్థాయికి ఎదగడం అని తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళా అధికారులను, క్రీడల్లో విజయం సాధించిన ఉద్యోగులను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ , అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, జిల్లా వైద్యాధికారి స్వర్ణ కుమారి, జిల్లా విద్యాధికారి రేణుక దేవి , డిపిఆర్ఓ చెన్నమ్మ , మెప్మా పీడీ రవికుమార్, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ సత్తార్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అర్థ సుధాకర్ రెడ్డి, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్ కాంతారావు, మెహరునిసా, సీనియర్ అసిస్టెంట్ రాములు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, మున్సిపల్ మహిళా కౌన్సిలర్స్ ప్రభుత్వ, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది, డిసిపియు సిబ్బంది, అంగన్వాడీ ఉద్యోగులు, ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలు ఇతర మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**వర్కవుట్ కు భారీగా లేదా ఆయిల్ ఫుడ్ తినకూడదు**

వర్కవుట్ కు ముందు ఎక్కువగా తింటే అలసట, జీర్ణ సమస్యలు రావచ్చు.



# మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి

**- ఎమ్మెల్యే విజయరమణ రావు**



**ముద్ర, పెద్దపల్లి:** ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో రూ. 75 లక్షలతో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి స్థానిక ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్ రావును ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయమే ప్రభుత్వం ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో గంగయ్య, స్థానిక సర్పంచ్ బంగారి రమేష్, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సదయ్య, పలు గ్రామాల సర్పంచ్ లు , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

**మరిన్ని బస్సులు ఏర్పాటు చేస్తా..**

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హైదరాబాద్ కు మరిన్ని బస్సులు ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీకి కట్టుబడి మంగళవారం కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో హైదరాబాద్ కు నూతన బస్సు సౌకర్యాన్ని ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్సు కాల్వశ్రీరాంపూర్ నుంచి ఓదెల మండలం కొలనూరు, సుల్తానాబాద్ మండలం మీదుగా కరీంనగర్ నుంచి హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబుల సహకారంతో ఆర్టీసీ అధికారులతో చర్చించి బస్సు సౌకర్యం కల్పించామన్నారు. త్వరలోనే పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటు చేస్తానని చెప్పారు. అనంతరం గోదావరిఖని, పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మీదుగా హనుమకొండ కు బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. గతంలో ఆరు నెలలు హైదరాబాద్ కు బస్సు నడిచిందన్నారు. తిరిగి ఇప్పుడు ఆ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్, ఏఎంసీ చైర్మన్ లు పాల్గొన్నారు.

## పుష్కరాలపై సమీక్షా సమావేశం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఇప్పటినుంచి పటిష్ట ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల అధికారులతో వారి ఆధ్వర్యంలో చేపట్టబోయే పనుల గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీపీఓ శ్రీనివాస్, డీఎంహెచ్ వో రాజేందర్, వివిధ శాఖల ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రమ దోపిడీకి గురవుతున్న డ్రైవర్లు




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న డ్రైవర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చాలా ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయా, అటెండర్, స్వీపర్, వాచ్‌మన్, డ్రైవర్ వంటి కార్మికులకు నెలకు కేవలం ₹4 వేల నుంచి ₹9 వేల వరకు మాత్రమే జీతాలు ఇస్తున్నారన్నారు. కనీస వేతన చట్టం ప్రకారం ఇది శ్రమ దోపిడీ అని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. జిల్లా కార్మిక శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

# భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**




**ముద్ర, కరీంనగర్:** ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన పలు ప్రభుత్వ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై డీఆర్డీఓ, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన గ్రామపంచాయతీ, అంగన్ వాడీ, పాఠశాల, ఇతర భవనాల నిర్మాణంలో వేగం పెంచాలన్నారు. ఇంకా ప్రారంభం కానీ పనులపై ఎంపీడీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. స్థలం కొరత ఉన్న గ్రామాల్లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో సందర్శించి అనువైన స్థలాన్ని వెంటనే గుర్తించాలని ఆదేశించారు. మండల స్థాయిలో సర్పంచ్, కార్యదర్శి, ఏఈ, డీఈ, ఎంపీడీవోలు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భవన నిర్మాణాల వేగవంతానికి, అక్కడ ఎదురయ్యే సమస్యల పరిష్కరించాలని తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్లాబ్, రూఫ్ లెవెల్ కు చేరుకున్న భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రజా పాలన కార్యక్రమంలో ప్రారంభించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్డీఓ శ్రీధర్, పంచాయతీరాజ్ ఈఈ రహమాన్, ఎంపీడీవోలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# పుష్కరాల పనులు త్వరగా పూర్తిచేయాలి

**- కలెక్టర్ రాహుల్ శర్మ**




**మహాదేవపూర్, ముద్ర:** కాళేశ్వరంలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో పుష్కరాల ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, విద్యుత్, మిషన్ భగీరథ, వైద్య, ప్రణాళిక శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాలకు చేపట్టిన అన్ని పనులు ఏప్రిల్ 30 వరకు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఘాట్ల వద్ద పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, విద్యుత్, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు, భక్తులు సురక్షితంగా స్నానం చేసేలా ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ, ఇరిగేషన్, పీఆర్, ఆర్ అండ్ బీ, విద్యుత్, మిషన్ భగీరథ, వైద్య, పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్ నిర్మించుకోవాలి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్ నిర్మించుకోవాలని పాక్పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వెంకన్న సూచించారు. సోన్ మండలం పాక్పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి పరీక్షల్లో విజయం సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలకు కంప్యూటర్ ను విరాళంగా అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.చంద్రశేఖర రావు, తోడిశెట్టి రవికాంత్, గటిక రవికాంత్, జువ్వల శ్రీధర్, బలిరాం, అరుణ, రత్నాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**మహదేవపురం ముద్ర:** ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల ఆధ్వర్యంలో మెడికవర్, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు బీపీ, షుగర్, గుండె, కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు . ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించగలర న్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఉద్యోగులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, టీజీఓ కార్యదర్శి సునీల్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ మహమ్మద్ సంధాని, కార్యవర్గ సభ్యులు డా.మధుసూదన్, ఫణి కుమార్, డా. వెంకన్న, సంతోష్, శ్రీనివాస్ రావు, స్వాతి టీజీఓ ప్రతినిధులు, వైద్యులు డా శ్రీదేవి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ప్రజా పాలన




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలో ప్రజా పాలన –ప్రగతి ప్రణాళికను విజయవంతంగా కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ కార్యక్రమం అమలుపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు చేరవేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలని ఆదేశించారు. వీసీలో భాగంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన –ప్రగతి ప్రణాళికను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆమె జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు విజయవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అన్ని కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ నెల 12న సారంగాపూర్ మండలం చించోలి (బి)లో సర్పంచ్ లు, మున్సిపల్ కౌన్సిలర్లకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం పై అవగాహన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్ర మంలో భాగంగా పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, సీపీఓ జీవరత్నం, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏటీసీతో ఉత్తమ శిక్షణ



**మహాదేవపూర్, ముద్ర:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏటీసీ (Advanced Training Centre) తో యువతకు ఉత్తమ శిక్షణ అందించి వారికి మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం ఏటీసీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 2డి, 3డి మిషన్, అడ్వాన్స్ డ్ సీఎన్‌సీ మిషన్, రోబోటిక్ వెల్డింగ్ మిషన్, ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించడం ద్వారా వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఏటీసీ కేంద్రం ద్వారా విద్యార్థులు ఆధునిక యంత్రాలపై శిక్షణ పొందుతూ తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జమ్మూలాల్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**వర్కవుట్ కు తగినంత నీరు తాగాలి**

వ్యాయామానికి ముందు శరీరం డీహైడ్రేషన్ కాకుండా నీరు తాగడం చాలా అవసరం.



## సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలి



### - మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

మహిళలు సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా భువనగిరి విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో గల మహాత్మ సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగు, పోలిశెట్టి అనిల్, సరగడ అమర్, ఎస్పిఓ హరీష్ కుమార్, విద్యుత్ బిసి ఉద్యోగులు బొబ్బిలి మురళి, రేసు శ్రీనివాస్, ఎస్ సిద్ధి లింగం, ర్యాకల బాల నరసింహ, బత్తిని కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

### సావిత్రి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

ముద్ర, మోత్కూరు:

బాలికల విద్యా కోసం, వింతంతుల మహిళల అభ్యున్నతి కొరకై నిరంతరం కృషి చేసిన సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా కార్యదర్శి. పోతగాని మల్లేశం, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత, పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి, మాజీ సర్పంచ్. బయ్యని పిచ్చయ్య, సంగి శెట్టి రూబెన్, తీగల నర్సింహ్మా, అల్లే యాదయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ బహూకరణ

ముద్ర, తుర్కపల్లి:



తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి జెడ్పిహెచ్ఎస్ లో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఎంపీటీసీ గిద్దె కరుణాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్యాడ్లను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని, మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను తానే స్వయంగా ఢిల్లీ పర్యటనకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఆయన మిత్రుడు బానోతు శ్రీను (మోతిరాం తండా) పాఠశాలలో మొదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. స్వరూపరాణి, ఉపాధ్యాయులు విష్ణు, ప్రభాకర్, రాజయ్య తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మంత్రి ఉత్తమ్ దంపతుల సహకారంతో

## గ్రామాభివృద్ధికి కృషి

### - సర్పంచ్ దున్నా శ్రీనివాస్

ముద్ర, నడిగూడెం:



రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ తెలిపారు. నడిగూడెం మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 10 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎలుగూరి నాగరాజు, ఎంపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి యలకా ఉమారాణి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

ముద్ర, మోత్కూర్:



మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామపంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో బాగంగా పాటిమట్ల హైస్కూల్ నుండి సదరషాపూర్ గ్రామ శివారు వరకు ఉన్న బునాదిగాని కాలువ పూడికతీత పనులను మంగళవారం ఎంపీడీఓ బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ వేజ్ సీకర్ లు ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా ఉదయం పూట వచ్చి మధ్యాహ్నం లోపు కేటాయించిన కొలతల మేరకు పనులు పూర్తిచేసుకుని ఇంటికి వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎన్ఎంఎంఎస్ హాజరు పై ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్న కారణంగా అందరు వేజ్ సీకర్ లు ఈ కేవైసీ పూర్తి చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కరుణాకర్ ఉపాధి హామీ సిబ్బంది నరేష్, వేజ్ సీకర్ లు హాజరయ్యారు.

## పేదలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వినతి

ముద్ర ప్రతినిధి, భువనగిరి :



మండలంలోని వడాయిగూడెంలో సర్వే నం. 518లో 70, 80 సంవత్సరాలుగా నిర్మించుకున్న నివాస గృహాలను నిషేధిత జాబితా (22A) నుండి తొలగించి పేద ప్రజలకు న్యాయం చేయాలని సర్పంచ్ నీల శిరీష ఓంప్రకాష్ గౌడ్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వినతి పత్రం పట్టణ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చుక్కల శంకర్ యాదవ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

# కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### - సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



ముద్ర ప్రతినిధి , కోదాడ:

ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేస్తూ విజయవంతం చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 21 వార్డులో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కుసుమ కుమారి, రెవెన్యూ డివిజనల్ అధికారి సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, వైస్ చైర్ పర్సన్ మల్లీశ్వరి, కౌన్సిలర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల, తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

కోదాడ పట్టణం ఆజాద్ నగర్ లోని జిల్లా పరిషత్ కట్ట శ్రీ సాయి భవాని మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంటశాల, కంప్యూటర్ రూమ్, టాయిలెట్లను పరిశీలించారు. అనంతరం స్కూలుకు సంబంధించిన బిల్లులు ఆన్లైన్లో ఎలా చేస్తారని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ మంచి మార్కులు తెచ్చుకోవాలని, ప్రతి సబ్జెక్టులో నూటికి డెబ్బై శాతం పైగా మార్కులు రావాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం వారికి పరీక్ష ప్యాడ్ లు, పెన్నులు, కంపాక్స్ లను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి కూడా పలు సూచనలు చేశారు. అనంతరం కోదాడ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, త్రాగునీరు, విద్యా, వైద్యం పై వచ్చిన దరఖాస్తులు 10 రోజులలో క్లియర్ చేయాలని సిబ్బందికి సూచించారు . ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ వాజిద్, ఎంఈఓ సలీం షరీఫ్, ప్రధానోపాధ్యాయులు సుశీల భాయ్, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మోత్కూరు సమస్యలను పరిష్కరిస్తా..



### - మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య

ముద్ర, మోత్కూరు:

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య అన్నారు. మంగళవారం మోత్కూరు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, మున్సిపల్ కమిషనర్ కే సతీష్ కుమార్, వార్డు కౌన్సిలర్ కురిమిల్ల ప్రమీల, కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వార్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గడ్డం స్వప్న సోమ నరసయ్య మాట్లాడుతూ వార్డుల్లో పారిశుద్ధ్యంకు సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత వార్డు కౌన్సిలర్ దృష్టికి తీసుకు వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు శ్రీకాంత్, వెంకన్న మేనేజర్ ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

### గ్రామ అభివృద్ధే లక్ష్యం..



ముద్ర, బీబీనగర్ :

గ్రామాన్ని అభివృద్ధి పరచడమే తన ధ్యేయమని ముగ్దుంపల్లి సర్పంచ్ శిగ నరేష్ అన్నారు. మంగళవారం మండలంలోని ముగ్దుంపల్లిలో మహిళలు స్వచ్ఛందంగా రోడ్లలోని చెత్త సేకరించి శుభ్రపరిచారు. "పరిశుభ్రమైన గ్రామమే – ఆరోగ్యకరమైన సమాజం" అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం తొలితరం మహిళ ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

### బాలికల గురుకుల పాఠశాలలో..

ముద్ర నడిగూడెం:

స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులు పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తను తొలగించారు. తరగతి గదులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామన్నారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ విజయశ్రీ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## చిన్నారులు ఉపాధ్యాయులైన వేళ..

ముద్ర, మోత్కూర్:

మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో, అంగన్వాడి 1, 2 కేంద్రాలలో మంగళవారం స్వపరి పాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు, చిన్నారులు ఉపాధ్యాయులుగా తమ పాత్రలు పోషించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు, పలకలు, పెన్నులు, పెన్సిల్స్ ను మున్సిపల్ కౌన్సిలర్ మొగుళ్ల అనూరాధ శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మొగుళ్ల అనూరాధను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ ఉమేష్ చంద్ర, ఉపాధ్యాయురాలు ఆండాలమ్మ, అంగన్వాడీ టీచర్లు చింతల విజయ, చుక్క సునీత, ఆయా మమత,విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీ భక్తాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

ముద్ర, మోత్కూరు:

మోత్కూర్ మండలంలోని రాగిబావి గ్రామంలో గల శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం 14వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకను మంగళవారం పురోహితులు భాస్కరభట్ల శివానంద శర్మ, ఆలయ ప్రతినిధి పసునూరి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో బొడ్రాయికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెండు శ్రీవాణి చంద్రశేఖర్ రెడ్డి, ఏసిపి కదారు వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ పానుగుళ్ల లక్ష్మీ రమేష్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అసౌకర్యం కలుగకుండా చూడాలి

ముద్ర, మోత్కూర్:

మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతి కాలనీలో 100 వాల్టెజ్ విద్యుత్ ట్రాన్స్ఫర్ ను మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమా నర్సయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ అసౌకర్యాలు కలగకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ మెంట రమణ నగేష్, ప్రభాకర్, లైన్ మెన్ జన్ రెడ్డి విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



## డబల్ బెడ్ రూం పనులను త్వరగా పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

పెండింగ్ లో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం భువనగిరి సింగన్నగూడెంలోని డబల్ బెడ్ రూమ్ ఇండ్లను జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పురోగతి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏడి శ్రీరాములు, అధికారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబానికి రూ.లక్ష ఎమ్మెల్యే సాయం



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

మండలంలోని బిఎన్ తిమ్మాపురం గ్రామస్థులు దొంకేన కేతమ్మ, దొంకేన నరేష్ గౌడ్, దొంకేన సురేష్ గౌడ్ లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి సమాచారంతో మంగళవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గ్రామానికి వెళ్లి మృతులకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా తన వంతుగా వారికి తక్షణ సహాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.

## బాధ్యతలు స్వీకరించిన జి.పి. సెక్రెటరి సురేష్

ముద్ర, నడిగూడెం:

మండల కేంద్రంలో చెన్నకేశవపురం గ్రామ పంచాయతీ నూతన సెక్రటరీ గా బాధ్యతలను గోదేశి సురేష్ స్వీకరించారు. ఆ సందర్భంగా ఆయనను శాలువాతో సర్పంచ్ గోసుల రాజేష్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కటికల పుల్లయ్య, వార్డు మెంబర్లు పప్పులు ఉపేందర్,పప్పుల ఉమా, కలకొండ మనోజ్, పాల్గొన్నారు.

## కౌన్సిలర్ కు సన్మానం

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

భువనగిరి 7వ వార్డు కౌన్సిలర్ కుక్కదూగ పద్మావతిని శ్రీ పెద్దమ్మ తల్లి పరపతి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరి పట్టణం కిసాన్ నగర్ లోని శ్రీ పెద్దమ్మ దేవాలయం ఆలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరపతి సంఘం సభ్యులు ఈర్ల వెంకటేష్, లింగాల బిక్షపతి, కుక్కదుగ సోమయ్య, తుపాకుల శ్రీని వాస్ కొలుపుల వివేకానంద, కుక్క దూగ కృష్ణ, తుపాకుల సురేష్, మేడ బోయిన కృష్ణంరాజు, జంగిటి రవీందర్, కుశంగల నరసింహ, మేడ బోయిన కుమార్, సొప్పరి రవి, జంగయ్య, మేడబోయిన గిరి పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 11.03.2026
www.mudranews.in | @mudranews



**వర్కవుట్‌కు వర్కవుట్ తర్వాత ప్రోటీన్ తప్పనిసరి**

వ్యాయామం తర్వాత ప్రోటీన్ తీసుకోవడం వల్ల కండరాల రికవరీ వేగంగా జరుగుతుంది.



# క్రీడలతో మానసికోల్లాసం

- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు
- అట్టహాసంగా పోలీసుల వార్షిక క్రీడలు ప్రారంభం







**ముద్ర ప్రతినిధి, మెదక్:**

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం పోలీసు వార్షిక క్రీడోత్సవాలను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్రీడోత్సవాల ప్రారంభానికి ముందు నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ తిలకించి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తూ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం ఎంతో అవసరమన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయన్నారు. క్రీడలు ఐక్యత, జట్టు భావన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. విధుల్లో ఎంత నిబద్ధతతో





పనిచేస్తారో, అదే ఉత్సాహంతో క్రీడల్లో కూడా పాల్గొని ప్రతిభ కనబరచాలని సూచించారు. ఇటువంటి క్రీడా కార్యక్రమాలు పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా కీలకంగా ఉంటాయన్నారు. ఈ క్రీడోత్సవాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, పరుగుపందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్రబోస్, సీఐలు మహేశ్, రేణుక రెడ్డి, కృష్ణమూర్తి, జాన్ రెడ్డి, వెంకట రాజా గౌడ్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ వేగవంతం చేయాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ లో వివిధ సెక్షన్ లను సందర్శించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని వివిధ జిల్లా శాఖల కార్యాలయాలతోపాటు ప్రాంగణంలో స్వచ్ఛత, పరిశుభ్రత పనులు పరిశీలించారు. నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలని అన్నారు. ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలని రికార్డులు, ఫైళ్లు నిబంధనల ప్రకారం భద్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు

**26 వార్డు లో పర్యటన**

మెదక్ పట్టణంలోని 26 వార్డు లో పర్యటించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ప్రజలంతా పరిశుభ్రత పాటించాలని, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ జుబేర్, సిబ్బంది తదితరులున్నారు.

## పక్కగా భూహక్కుల కోసం రీసర్వే

అదనపు కలెక్టర్ నగేష్



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పక్కగా భూ హక్కుల కోసం రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూభారతి రీ సర్వే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిజాం ప్రభుత్వం 35 నుంచి 40 ఏళ్ల మధ్య కష్టపడి పనిచేసి భూమి నక్షాను రూపొందించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి కొన్ని గ్రామాల్లో భూనక్షాల్లో సమస్యల తలెత్తాయన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకే భూ రీ సర్వే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి ప్రతి భూ కమతానికి ఆన్లైన్ డిజిటలైజేషన్లో పొందపరుస్తామన్నారు. ఎలాంటి భూ వివాదాలు లేకుండా చేసి, భూమికి భూధార్ ను అందించడం జరుగుతుందన్నారు. భూమి ప్రతి రైతుకు ఒక సెంటిమెంట్ అని, భూమి కోసం రైతులు పరితపిస్తూ ఉంటారన్నారు. భూ సమస్యలు లేకుండా చేయడమే దీని ఉద్దేశం అన్నారు. జిల్లాలో 24 గ్రామాల్లో భూ రీసర్వేను శాస్త్రీయంగా నిర్వహించి రైతుల భూ హక్కులను పరిరక్షిస్తామన్నారు. భూ రిసర్వే అనంతరం విదేశాల్లో ఉన్న వారు సైతం పక్కగా వారి భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, ల్యాండ్ సర్వే ఏడీ కిషన్, డీపీఆర్వో రామచంద్ర రాజు, తహసీల్దార్ రజనీ, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలతో అప్రమత్తం



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సారంగి సందన్న అన్నారు. ప్రజా పాలన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక అంబిటస్ పాఠశాలలో అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన, వాటికి ఎదుర్కోవడం ఎలా అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండటం ద్వారా అగ్నిప్రమాదాల సంభవించినప్పుడు ప్రమాద తీవ్రత తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి విద్యా, వాణిజ్య సముదాయాల్లో అగ్నినిరోధక యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంతకు ముందు సిలిండర్ ప్రమాదవశాత్తు పేలినప్పుడు ఎలా నివారించాలో వివరించిన తీరు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ట్రెస్మా అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారులు సికిందర్, రాజేశ్ , సిబ్బంది పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



**ముద్ర, నిజామాబాద్:**

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం ముస్లింలకు రంజాన్ కానుకగా ఆయన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను సోదరభావంతో ఆనందంగా నిర్వహించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ, నగర మేయర్ ఉమారాణి పాల్గొన్నారు.

# మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే మహిళలు ప్రతి రంగంలో అద్భుతాలు సృష్టించగలరని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ (టీఎన్జీవోస్) ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళలు ఏ రంగంలో ఉన్నా తమ బాధ్యతలను మరువకుండా అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఎదగాలన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం, క్యాంటిన్ల నిర్వహణ, యూనిఫామ్ లు కుట్టే బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించడం వంటి పలు చర్యలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. వచ్చిన అన్ని అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా మరింత ఎదగాలని సూచించారు. అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ మహిళలు సహనం, పట్టుదలకు ప్రతిరూపాలన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని తెలిపారు. కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ విధులను సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మహిళా ఉద్యోగులకు సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగుల కోసం నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి ఈ సందర్భంగా బహుమతులు ప్రదానం చేశారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి విజయలక్ష్మి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, కార్యదర్శి రవి, కోశాధికారి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, శ్రీకాంత్, రాష్ట్ర మహిళా కార్యదర్శి నిర్మలా రాజకుమారి, హెచ్‌డబ్ల్యుఓ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, పంచాయితీ కార్యదర్శుల రాష్ట్ర అధ్యక్షులు బలరాం, సుధామణి, లక్ష్మి, సుధారాణి, వెంకటేశం, యాదవ్ రెడ్డి, షరీఫ్, జగన్, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

**ముద్ర, నిజామాబాద్:**

జిల్లాలోని మోర్తాడ్ మండలంలోని ఇసుక దందా మూడు లారీలు, ఆరు ట్రాక్టర్లతో యదేచ్ఛగా సాగుతోంది. గాండ్లపేట్ పెద్దవాగు నుంచి అర్ధరాత్రి పొక్లెయిన్‌తో తవ్వకాలు చేపడుతూ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా, అధికారులు తమకే మీపట్టునట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. అధికారులు సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పది రోజులకు ట్రాక్టర్‌కు రూ.50 వేలు**

ప్రస్తుతం ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు కారణం ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే విధానం తీసుకురావడం. ఇప్పటి వరకు ఇసుక రీచ్‌లు అధికారికంగా ప్రారంభం కాకపోవడంతో ఇసుకకు విపరీతంగా డిమాండ్ ఏర్పడింది. దీంతో గిరాకీతోపాటు ధర ఎక్కువగా వచ్చే అవకాశం ఉండడంతో అంది వచ్చిన అవకాశంగా భావించిన కొందరు నాయకులు గాండ్లపేట్ గ్రామ కమిటీతో పది రోజులకు ట్రాక్టర్‌కు రూ.50



వేలు చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. రాత్రి నుంచి తెల్లవారు వరకు వాగు నుంచి ఇసుకను తరలించే అవకాశం ఉంటుంది. దీంతో రాత్రి నుంచి తెల్లవారే వరకు ప్రతిరోజు గాండ్లపేట్ పెద్దవాగు నుంచి పెద్దమొత్తంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక దందా జోరుగా సాగుతుండడంతో గాండ్లపేట్‌తోపాటు మోర్తాడ్ శివారు ప్రాంతాల్లో కూడా పెద్ద మొత్తంలో ఇసుక డంపులు దర్శనమిస్తున్నాయి. వారం రోజులుగా ఇసుక అక్రమ తరలింపుపై సమాచారం మోర్తాడ్‌తో పాటు కమ్మర్‌పల్లి, చుట్టుపక్కల ప్రాంతాలకు తెలిసినా అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. ఇసుక అవసరం ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం 'మన ఇసుక –మన వాహనం' యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ విధానంలో ఇసుక అవసరమైన వారు దరఖాస్తు చేసుకుంటే సంబంధిత కార్యదర్శికి సమాచారం వెళ్తుంది. దరఖాస్తుకు సంబంధించి పరిశీలన చేసి కార్యదర్శి ఓకే చెబితే సంబంధిత తహసీల్దార్‌కు దరఖాస్తు వెళ్తుంది. అక్కడి నుంచి ఇసుకరీచ్‌కు వెళ్లడం అక్కడి నుంచి ఇసుక తెచ్చుకునే అవకాశం ఉంటుంది. కానీ ఈ విధానం ప్రస్తుతం ఇక్కడ అమలుకావడంలేదు. దరఖాస్తులు చేసుకున్న వారు ఉన్నారు.కానీ ఈ విధానంలో ఎవరికి ఇప్పటి వరకు ఇసుక రాలేదు. దీంతో ఇండ్లు ఇతర నిర్మాణాలు చేపడుతున్న వారికి ఇసుక అత్యవసరంగా మారింది. ఇదే అదునుగా భావించి పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను నివారించడానికే ఇసుక వాహనం విధానాన్ని తీసుకువచ్చామని చెబుతుంటే, మరోవైపు నాయకులే ఇసుక అక్రమ రవాణాకు తెరలేపుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు

బీఆర్ఎస్ నాయకుడు మచ్చ వేణుగోపాల్ రెడ్డి



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మొదటి నుంచి రైతులంటే చిన్న చూపే ఉందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమయానికి రైతుబంధు అందించారని వ్యవసాయాన్ని రాష్ట్రానికి వెన్నెముకగా నిలిపారని గుర్తు చేశారు. కానీ ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పంట కోతకు వచ్చిన కూడా ఇప్పటివరకు రైతుబంధు డబ్బులు జమ చేయలేదన్నారు. అలాగే కందుల కొనుగోలులో రైతులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న నియమ నిబంధన వల్ల తక్కువ ధరకే రైతులు కందులను బయట మార్కెట్లో అమ్ముకుంటున్నారన్నారు. రైతులు యూరియా దొరకక అనేక ఇబ్బందులు పడుతున్నారని షాపుల్లో లేని యూరియా యాపుల్లో ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఉగాది పండుగలోగా రైతులందరికీ రైతుబంధు అందించి, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు నాగరాజు రెడ్డి, మల్లిఖార్జున్, నాయకులు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, పొన్నమల్ల రాములు, ఇర్షాద్ హుస్సేన్, సత్యం రెడ్డి, దరిపల్లి శ్రీనివాస్, సయీద్ , సాయి చరణ్ గౌడ్ కిట్టు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
11.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వర్కవుట్‌కు కార్బోహైడ్రేట్లు కూడా అవసరం**

వ్యాయామం తర్వాత కార్బ్స్ తీసుకోవడం వల్ల శరీరంలో ఖర్చైన శక్తి తిరిగి వస్తుంది.






# వెల్ కం సార్..

- **నూతన గవర్నర్ కు సీఎం స్వాగతం**
- **శంషాబాద్ ఎయిర్ పోర్టులో భేటీ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణకు కొత్త గవర్నర్‌గా ఇటీవల నియమితులైన శివప్రతాప్ శుక్లా తొలిసారి రాష్ట్రానికి చేరుకున్నారు. మంగళవారం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న గవర్నర్ దంపతులకు సీఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ కే.రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డితో పాటు సీఎం అక్కడే గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బుధవారం హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ చేతుల మీదుగా కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు లోక్ భవన్ లో అధికారులు చేస్తున్నారు. ఇటీవల పలు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కొత్త గవర్నర్లను నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ గా కొనసాగుతున్న శివప్రతాప్ శుక్లాను తెలంగాణకు బదిలీ చేసింది. తెలంగాణలో పని చేసిన జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్రకు బదిలీ చేసింది.



# కోకాపేటలో ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం

- **నగరవ్యాప్తంగా ఫర్టిలిటీ సేవల విస్తరణ**

భారతదేశంలోనే అగ్ర సంతానసాఫల్య సంరక్షణ నెటవర్క్‌లలో ఒకటి అయిన ఒయాసిస్ ఫర్టిలిటీ నగరంలోని కోకాపేటలో అత్యాధునిక కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. దేశంలోనే అత్యున్నత డిమాండ్ మార్కెట్ అయిన అత్యాధునిక సంతానసాఫల్య సంరక్షణను పెంచడానికి, అందరికీ అందుబాటులోకి తేవాలన్న తమ ప్రణాళికలో భాగంగా దాదాప 16 సంవత్సరాల క్లినికల్ నైపుణ్యం కలిగి ఒయాసిస్ ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తోంది. కోకాపేట్ కేంద్రం ప్రారంభంతో ఇది నగరంలో తొమ్మిదవ కేంద్రాన్నిప్రారంభించడం ద్వారా నగరంలో తన ఉనికిని బలోపేతం చేసుకుంటోంది. ఇది దేశంలో ఒయాసిస్ కేంద్రాలలో 35వది కానుంది.సంతానసాఫల్యత సవాళ్ల గురించి అవగాహన పెరుగుతుండడం, నగర జీవనశైలి వంటి అంశాలు ఆలశ్యంగా పిల్లలు కావాలనుకుండడంతో హైదరాబాద్ నగరంలో ప్రత్యేక సంతానసాఫల్య సేవలకు డిమాండ్ క్రమంగా పెరిగింది. ఫలితాలను ప్రభావితం చేసే జాప్యాలు లేకుండా జంటలు క్రమం తప్పకుండా రోగనిర్ధారణ, నిర్మాణాత్మక చికిత్సా మార్గాలు, వ్యక్తిగతీకరించిన సంరక్షణను పొందేందుకు కోకాపేట కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పదే పదే గర్భస్రావాలు, ఐవిఎఫ్ విఫలం కావడం, పునరావృత ఇంప్లాంటేషన్ వైఫల్యాలు, ట్రయల్‌అండ్‌ఎర్రర్ నమూనా కంటే మూల కారణాలను గుర్తించడం, వ్యక్తిగతీకరించిన చికిత్సా ప్రణాళికలను అందించడంపై దృష్టి సారించే శాస్త్రీయ విధానం ద్వారా అన్నిరకాల వంధ్యత్వ సవాళ్లను ఎదుర్కొనేందుకు జంటలకు ఒయాసిస్ ఫెర్టిలిటీ అందించే తోడ్పాటును విస్తృతంగా గుర్తింపు పొందింది. ఒయాసిస్ ఫర్టిలిటీ అభివృద్ధి ప్రయాణంలో హైదరాబాద్ ఒక ముఖ్యభాగమని, ఇక్కడ తమ విస్తరణ కేవలం గణాంకాల కోసం కాక అవసరాన్ని బట్టి ఉందని ఒయాసిస్ ఫర్టిలిటీ సహ వ్యవస్థాపకులు, మెడికల్ డైరెక్టర్ డా. దుర్గా జి. రావ్ అన్నారు. సంతానసాఫల్యత గురించి అవగాహన, పెరిగిన డిమాండ్ కారణంగా నగరంలో ప్రణాళికాబద్ధమైన విస్తరణ అవసరమని పుష్కరాజ్ షెనాయ్ అన్నారు. కోకాపేట్ కేంద్రం ప్రారంభంతో పశ్చిమ హైదరాబాద్ ప్రజలు అత్యాధునిక సంతానసాఫల్య సంరక్షణను తమ ఇంటికి దగ్గరే పొందవచ్చని ఒయాసిస్ ఫర్టిలిటీ, కోకాపేట కన్సల్టెంట్ డా. వల్లభరెడ్డి దేవి శ్యామల్ అన్నారు.కోకాపేట కేంద్రం ఐవిఎఫ్, పురుషుల, స్త్రీల వంధ్యత్వాన్ని ఐయుఐ, సాఫల్యత పరిరక్షణ, అత్యాధునిక రోగనిర్ధారణ, అనుభవజ్ఞులైన వైద్యులు, ప్రామాణీకరించిన క్లినికల్ ప్రోటోకాళ్లతో సమగ్ర సంతానసాఫల్య సేవలను అందిస్తుంది.

# వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- **త్వరలో ఎంజీఎం హాస్పిటల్ ప్రారంభం**
- **అండర్ గ్రౌండ్ పనులకు శంకుస్థాపన**
- **యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి**
- **వరంగల్ నగరాభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జి పొంగులేటి సమీక్ష**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి రాష్ట ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మంగళవారం సచివాలయంలోని తన ఛాంబర్ లో వరంగల్ జిల్లా అభివృద్ధిపై దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్షించారు. హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే కృత నిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అమలులో వేగం పెంచాలన్న ఆయన ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన వివిధ ప్రగతి పనులు వచ్చే జూన్ 2 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు నిర్విరామంగా పనిచేయాలని సూచించారు. భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు, భద్రకాళి చెరువు డీ సిల్టేషన్ అంశాలకు సంబంధించి ఆలయ మాడవీధుల్లో కృష్ణశిలతో నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భద్రకాళి చెరువు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఇన్ ఫాల్ అవుట్ ఫాల్ విషయంలో భూ సేకరణను వేగవంతం చేయాలన్నారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా శంకుస్థాపన చేసి, గాలికి వదిలేసిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను పూర్తి చేశామని తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి ఆ ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆస్పత్రి నిర్మాణ పనులు, ఆసుపత్రి సామగ్రి ఏర్పాటు, డాక్టర్ల నుంచి మొత్తం సిబ్బంది నియామకానికి సత్వరమే కార్యాచరణను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్లకు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ పట్టణంలో రూ.5,257 కోట్లతో చేపట్టే భూగర్భ డ్రెయినేజీ పనులకు సంబంధించి వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి వచ్చేనెలలో పనులను ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రెండు పడక గదుల నిర్మాణాలకు ఈనెల 31లోగా లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయించాలని సూచించారు. టూ బీహెచ్‌కే కాలనీల్లో కరెంట్, డ్రెయినేజ్, తాగునీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలను ఆనాటి ప్రభుత్వం విస్మరించిందని తక్షణమే ఆయా కాలనీల్లో కనీస వసతుల ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు పంపిస్తే నిధుల మంజూరు చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, నాయిని రాజేందర్, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హన్మకొండ కలెక్టర్లు సత్య శారద, స్నేహశభరీష్ పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి పెద్దపీట

- **రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**
- **జూబ్లీహిల్స్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పునరుద్ఘాటించారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్ డివిజన్లో రూ.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టబోయే వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లకు స్థానిక శాసనసభ్యులు నవీన్ యాదవ్ తో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో రాష్ట్రంలో మొత్తం 16 వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ మంజూరు కాగా హైదరాబాద్ జిల్లాకు నాలుగు భవనాలు కేటాయించినట్లు వివరించారు. ఈ నియోజకవర్గంలో ఒక్కొక్క భవనానికి రూ.20 కోట్ల అంచనా వ్యయంతో రెండు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. హాస్టల్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ హాస్టల్ భవన నిర్మాణంతో వెయ్యి మంది వర్కింగ్ మహిళలకు వసతి కల్పించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత వడ్డెర కులస్తులు నివాసం కోల్పోవడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకురాగా, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి డబుల్ బెడ్రూం ఇళ్లు అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్యాబోధన, నాణ్యమైన ఆహారం అందించడంతోపాటు, పిల్లల ఆటలకు ఎంతో ఖరీదైన ఆట వస్తువులను కేంద్రాలకు అందించామన్న మంత్రి, అంగన్వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళల ఉజ్వల భవిష్యత్తుకు నియోజకవర్గంలో రెండు హాస్టల్స్ ను చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, ఆర్డీవో సాయిరాం, మాజీ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# రైతులపై కేసులు పెడితే తీవ్ర పరిణామాలు

- **కేంద్రమంత్రి బండి సంజయ్**
- **రంగ నాయక్ సాగర్ ద్వారా సిరిసిల్లకు నీరివ్వని కేటీఆర్ రైతు ద్రోహి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రంగనాయక్ సాగర్ కెనాల్ పనులు పూర్తి చేయాలంటూ నిరసనకు దిగిన రైతులను అరెస్ట్ చేయడాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఖండించారు. రైతులకు సంఘీభావం తెలిపిన బీజేపీ నాయకులను స్టేషన్ కు తరలించడం సరికాదని మండిపడ్డారు. తక్షణమే రైతులను, నేతలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు నిరసన చేస్తే వారిని అరెస్ట్ చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలానికి నీళ్లిచ్చే కాలువ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. రూ.3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా పనులు ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. కాలువ పనులు పూర్తి చేసి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రంగనాయక్ సాగర్ ద్వారా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ రైతు ద్రోహి అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల వైఫల్యాలతో రైతులు వరుసగా పంటలు నష్టపోతున్నారని కేంద్రమంత్రి అన్నారు. తక్షణమే పనులు ప్రారంభించకపోతే ఆయా ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. రంగనాయక్ సాగర్ 11వ ప్యాకేజీ నుంచి ఎల్ఎం 4, ఎల్ఎం 6 ద్వారా కాలువ పనులను పూర్తి చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# ప్రభాకర్ రావుకు 'సుప్రీం' ఊరట

- **ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు**
- **సిట్ దర్యాప్తునకు సహకరించాలని ఆదేశాలు**
- **సాక్ష్యాలు, ఆధారాల ట్యాంపరింగ్ కు ప్రయత్నిస్తే బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరిక**
- **ట్రయల్ కోర్టు పర్మిషన్ లేకుండా ఎక్కడికీ వెళ్లొద్దని ఆదేశాలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన పరిణామం చోటు చేసుకుంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ లో కీలక నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ప్రభాకర్ రావుకు అరెస్ట్ నుంచి మినహాయింపు కల్పిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని అత్యున్నత న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు చేస్తున్న దర్యాప్తుకు సహకరించాలని సూచించింది. దీంతో ఈ కేసులో ప్రభాకర్ రావుకు అరెస్ట్ భయం నుంచి విముక్తి లభించనుంది. ఇక ఈ కేసులో సాక్ష్యాలను, ఆధారాలను ట్యాంపర్ చేసినా, చేసేందుకు ప్రయత్నించినా, ఈ కేసులో సాక్షులుగా ఉన్న వారిని ప్రభావితం చేసినా మంజూరు చేసిన ముందస్తు బెయిల్ రద్దు అవుతుందని సుప్రీం కోర్టు హెచ్చరికలు జారీ చేసింది. ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా రాష్టం, దేశం దాటేందుకు వీలులేదని సూచించింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో గత ప్రభుత్వంలో పోలీస్ ఉన్నతాధికారులుగా పనిచేసిన కొందరిపై సిట్ అధికారులు కేసులు నమోదు చేశారు. అందులో ప్రభాకర్ రావుతోపాటు ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, తిరుపతన్న ఉన్నారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరించిన ప్రభాకర్ రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసులో పలు సంచలన ఆరోపణలను సిట్ అధికారులు మోపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు నిందితులపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రభాకర్ రావుకు ముందస్తు బెయిల్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

# 7,700 కోళ్లు మృతి

- **బర్డ్ ఫ్లూ గా అనుమానం**


**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి :**

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందే గ్రామంలో బర్డ్ ఫ్లూ అనుమానంతో కలకలం రేగింది. గ్రామానికి చెందిన రంగనమైన కుమార్‌కు చెందిన పౌల్ట్రీ ఫారంలో సుమారు 7,700 కోళ్లు అకస్మాత్తుగా మృతి చెందాయి. కోళ్ల మృతితో రైతులు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పశుసంవర్ధక శాఖ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన కోళ్ల నమూనాలను సేకరించి పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపించారు. వైరస్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటూ రైతులకు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. అధికారులు పూర్తి స్థాయి నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు.



వర్కవుట్‌కు 30–60 నిమిషాల్లో ఆహారం తీసుకోవాలి

వర్కవుట్ పూర్తయ్యాక ఒక గంటలోపు ఆహారం తీసుకుంటే శరీరం త్వరగా కోలుకుంటుంది.







# 'సేవ్ ద గర్ల్ చైల్డ్' లోగో ఆవిష్కరణ

- **చంచల్‌గూడ ఎస్పీ శివకుమార్**

**ముద్ర న్యూస్ :**

మహిళలను, బాలికలను గౌరవించే సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని చంచల్‌గూడ జైలు ఎస్పీ శివకుమార్ గౌడ్ అన్నారు. మహిళ దినోత్సవ వారోత్సవాల లో భాగంగా ఎర్రమంజిల్ సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యాలయంలో మహిళ పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటితో శివకుమార్ గౌడ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో సేవ్ ద గర్ల్ చైల్డ్ సంస్థను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. బాలికలను, మహిళలను గౌరవించే విధానాన్ని తల్లిదండ్రులే బాధ్యతగా తీసుకొని వారి పిల్లలకు నేర్పించాలన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే నిందితులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా శిక్షపడాలన్నారు. తమ సంస్థ నుంచి పేద విద్యార్థులకు విద్యాపరంగా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముందడుగు లోగో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సేవ్ ద గర్ల్ చైల్డ్ మహిళా బృందం డా. స్రవంతి, గీతారెడ్డి, రాగి స్వప్న, డా. శ్రీవాణి, ప్రియాంక, రజిత, మౌనిక, సౌజన్య, సుభాషిణి, ముందడుగు ఫౌండేషన్ సభ్యులు కొన్నె దేవేందర్, కొమటి రమేష్‌బాబు, శివనాగ రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.





# రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- **ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రతి రోజు ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్‌గా ఎంతమంది పేషెంట్లు వస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు చెకప్‌కు ఎంతమంది వస్తున్నారో తెలుసుకొని, ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయా అని తెలుసుకొని, ప్రతి నెల ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సమయానికి చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మందుల అందుబాటు వంటి అంశాలను పరిశీలించారు. వైద్య సేవలు మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఔట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ రిజిస్టర్‌లను, వార్డు రూమ్, మందుల గదులను పరిశీలించారు. అనంతరం పక్కనే ఉన్న సఖి కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ రజని మరియు ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్ భగాయత్ అభివృద్ధికి రూ.13 కోట్ల నిధులు

**ముద్ర, కాప్రా :**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ భగాయత్ ప్రాంత అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారం, కృషితో ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలుమార్లు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించిన హెచ్ఎండీఏ అధికారులు వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.13 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ నిధులతో కాలనీ అభివృద్ధికి పలు ముఖ్యమైన పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా రూ.3.40 కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టనుండగా, రూ.9.60 కోట్లతో సుమారు 10 కిలోమీటర్ల మేర బ్లాక్‌టాప్ రోడ్లను నిర్మించి రహదారి సౌకర్యాలను మెరుగుపరచనున్నారు. కాలనీలో చెత్త సమస్యను దృష్టిలో ఉంచుకొని 42 మంది పారిశుధ్య కార్మికులను ప్రత్యేకంగా కేటాయించినట్లు తెలిపారు. హెచ్ఎండీఏ లేఔట్‌లో రైతు బజార్ అభివృద్ధి, సుమారు 8 ఎకరాల పార్కు స్థలానికి కాంపౌండ్ వాల్, వాకింగ్ ట్రాక్, స్ట్రీట్ లైట్లు, పిల్లలు, పెద్దలకు వినోదానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. వెస్ట్ సైడ్ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్, రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, మంచినీటి సరఫరా వంటి సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో ఉప్పల్ భగాయత్ ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపిరి లభించనుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అన్నివర్గాల సంక్షేమానికి 99 రోజుల కార్యాచరణ

- **ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను పక్కగా అమలు చేయాలి**
- **జిల్లా అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు**

**ముద్ర, ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా ప్రతినిధి :**





అన్ని వర్గాల సంక్షేమానికై రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణను అమలు చేస్తున్నదని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రజా పాలనప్రగతి ప్రణాళిక అమలు పై కలెక్టర్ సి,నారాయణా రెడ్డి, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుద్ధ నిర్వహణ విధిగా చేపట్టాలని, అదే విధంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. సమస్యలు లేని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఉగాది సందర్భంగా సామూహిక గృహప్రవేశాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా చివరి దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. గ్రౌండింగ్ కానీ పనులు గ్రౌండింగ్ చేసి పూర్తి అయ్యేలా చూడాలని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, జనన మరణ ధృవీకరణ పత్రాలు వంటివి ఏ ఒక్క ఫైల్ కూడా పెండింగ్ లేకుండా నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట మరమ్మత్తులు, పెయింటింగ్ పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఏ ఒక్క అధికారి కూడా నిర్లక్ష్య ధోరణి అవలంభించకుండా పని చేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు. ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు చేయాలని పరీక్ష కేంద్రంలో అన్నీ మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**పెండింగ్ ఫైళ్లను క్లియరెన్స్ చేయాలి..**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సిరిగిరిపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల, మహేశ్వరం ప్రధాన రహదారి శుభ్రత పనులను ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయ కార్యకలాపాలను సమీక్షించి, స్థానిక పరిపాలనను మెరుగుపరచడానికి చర్చించారు. ప్రాథమిక పాఠశాల సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో సంభాషించారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మహేశ్వరం ప్రధాన రహదారిలో శుభ్రత పనుల పురోగతిని సమీక్షించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఎటువంటి ఫైల్ పెండింగులో లేకుండా 16వ తేదీ వరకు పరిష్కరించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12వ తేదీ వరకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో 99 రోజుల పాటు కార్యచరణ అమలు చేయాలని, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కలెక్టర్ వెంట కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఎంపీవో రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# రూ. 3వేల కోట్ల ఐపీవోకు ట్రూహోమ్ ఫైనాన్స్ దరఖాస్తు

**వార్బర్గ్ పింకస్ మద్దతుతో సెబీకి డీఆర్‌హెచ్‌పీ దాఖలు**

**ముద్ర, బిజినెస్ డెస్క్ :**

Truhome FINANCE

అఫోర్డబుల్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్) తమ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో) కోసం మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) దాఖలు చేసింది. మొత్తం రూ. 3,000 కోట్ల ఐపీవోలో రూ. 1,500 కోట్ల కొత్త షేర్ల జారీతో పాటు మరో రూ. 1,500 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ప్రమోటర్ మ్యాంగో క్రెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ఈ ఆఫర్ ఫర్ సేల్‌లో షేర్లు విక్రయించనుంది.

**నిధుల వినియోగం**

ఈ ఐపీవో ద్వారా సమీకరించే నిధులను వ్యాపార విస్తరణ, రుణాల పంపిణీ మరియు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు. అలాగే ఆర్‌బీఐ నిర్దేశించిన క్యాపిటల్ అడెక్వసీ నిబంధనలను పాటించేందుకు కూడా ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. ఈ నిధులను 2027, 2028 ఆర్థిక సంవత్సరాల్లో వినియోగించనున్నట్లు సంస్థ తెలిపింది.

**సంస్థ కార్యకలాపాలు**

2010లో స్థాపితమైన ట్రూహోమ్ ఫైనాన్స్ అందుబాటు ధర గల గృహాలకు రుణాలు అందించే రిటైల్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ. 2024 డిసెంబర్‌లో న్యూయార్క్‌కు చెందిన గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్బర్గ్ పింకస్ సంస్థను కొనుగోలు చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 216 శాఖల ద్వారా సేవలు అందిస్తోంది.

**వ్యాపార విస్తరణ**

2025 డిసెంబర్ 31 నాటికి సంస్థకు రూ. 21,124.32 కోట్ల ఏయూఎం ఉంది. దేశంలో మూడో అతిపెద్ద అఫోర్డబుల్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా నిలిచింది. 2023-2025 మధ్య కాలంలో 48.58 శాతం వార్షిక వృద్ధి నమోదు చేసింది. సంస్థ ఏయూఎంలో 57.37 శాతం గృహ రుణాలు కాగా, ప్రాపర్టీపై రుణాలు 39.22 శాతం ఉన్నాయి.

**ఆస్తుల నాణ్యత, లాభదాయకత**

2025 డిసెంబర్ నాటికి స్థూల స్టేజ్3 అసెట్స్ 1.60 శాతం, నికర స్టేజ్3 అసెట్స్ 1.09 శాతం ఉన్నాయి. 2025 డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల్లో సంస్థ రూ. 333.53 కోట్ల పన్ను అనంతర లాభం నమోదు చేసింది. ఆర్‌వోఏ 2.66 శాతం, ఆర్‌వోఈ 11.62 శాతంగా ఉన్నాయి. మొత్తం ఆదాయం FY23లో రూ. 780.49 కోట్ల నుంచి FY25లో రూ. 1,905.48 కోట్లకు పెరిగింది.

**మేనేజ్‌మెంట్, బ్యాంకర్లు**

సంస్థ ఇటీవల ఎస్‌బీఐ మాజీ చైర్మన్ దినేష్ కుమార్ ఖరాను ఐదేళ్ల కాలానికి చైర్‌పర్సన్‌గా నియమించుకుంది. రవి సుబ్రమణియన్ ఎండీ, సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జేఎమ్ ఫైనాన్షియల్, ఐఐఎఫ్‌ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, జెఫ్రీస్ ఇండియా, కోటక్ మహీంద్రా క్యాపిటల్ సంస్థలు ఈ ఐపీవోకు బ్యాంకర్లుగా వ్యవహరిస్తున్నాయి.

# మహిళా సాధికారతకు 'మహీంద్రా' ప్రోత్సాహం

- **జహీరాబాద్ ట్రాక్టర్ ప్లాంట్‌లో మహిళా ఉద్యోగులకు సన్మానం**

**ముద్ర, జహీరాబాద్ :**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్‌కు చెందిన మహీంద్రా ట్రాక్టర్స్ సంస్థ జహీరాబాద్‌లోని తమ ట్రాక్టర్ తయారీ కేంద్రంలో మహిళా ఉద్యోగులను సత్కరించింది. జహీరాబాద్ ట్రాక్టర్ ప్లాంట్‌లో వివిధ విభాగాల్లో 350కు పైగా మహిళలు పనిచేస్తున్నారు. మహిళా సాధికారతకు ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తోంది. మహిళలకు అనుకూలమైన, సహాయకరమైన పని వాతావరణాన్ని కల్పిస్తూ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచే విధంగా సంస్థ చర్యలు చేపడుతోంది. మాతృత్వ దశలో ఉన్న మహిళా ఉద్యోగుల కోసం ఐదేళ్లపాటు అమలులో ఉండే "కెరీర్ భరోసా మరియు సౌలభ్యం" విధానాలను అమలు చేస్తూ పనివ్యక్తిగత జీవిత సమతౌల్యాన్ని ప్రోత్సహిస్తోంది. 2012లో స్థాపితమైన జహీరాబాద్ ప్లాంట్ ఆసియాలోనే అతిపెద్ద ట్రాక్టర్ తయారీ యూనిట్‌లలో ఒకటిగా గుర్తింపు పొందింది. సంవత్సరానికి 1,30,000 ట్రాక్టర్ల ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తూ దేశీయ మార్కెట్‌తో పాటు అమెరికా, బ్రెజిల్, ఆఫ్రికా సహా 50కు పైగా దేశాలకు ట్రాక్టర్లను ఎగుమతి చేస్తోంది. ఈ కేంద్రంలో 3,200 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. మహీంద్రా సంస్థ నాగ్‌పూర్, రుద్రపూర్ మరియు జైపూర్‌లో ఉన్న తమ ఇతర ప్లాంట్‌లలో కూడా మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

# నిరుద్యోగంతో యువతి ఆత్మహత్య

- **కేపీహెచ్‌బీలో విషాదం**

**ముద్ర, కూకట్‌పల్లి :**

ఉద్యోగం లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఖమ్మంకు చెందిన మాసనం సైదులు కుటుంబం గత ఆరు నెలలుగా కేపీహెచ్‌బీ రైతు బజార్ వెనుక నివాసం ఉంటోంది. మంగళవారం ఉదయం సైదులు తన భార్యతో కలిసి చికిత్స నిమిత్తం నిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. కుమారుడు సూరజ్ పనికి వెళ్లగా, కుమార్తె సుష్మ (27) ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆసుపత్రి నుంచి సైదులు ఫోన్ చేయగా సుష్మ ఫోన్ తీయకపోవడంతో అనుమానం వచ్చి కింద అంతస్తులో ఉండే పొరుగు నివాసికి సమాచారం అందించారు. ఆమె వెళ్లి చూడగా పెంపుడు కుక్క నిరంతరం అరుస్తుండటం, లోపల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుమారుడు సూరజ్ ఇంటికి చేరుకుని చూడగా సుష్మ బెడ్‌రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించింది. అంబులెన్స్ సిబ్బంది పరీక్షించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సుష్మ గతంలో విప్రో కంపెనీలో పనిచేసేది. మూడేళ్ల క్రితం ఉద్యోగం కోల్పోవడంతో అప్పటి నుంచి ఖాళీగా ఉంది. కొత్త ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి, డిప్రెషన్‌కు గురైనట్లు తెలిసింది. ఈ ఘటనపై తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై తండ్రి ఎవరిపైనా అనుమానం వ్యక్తం చేయలేదు.



వర్కవుట్‌కు జంక్ ఫుడ్ దూరంగా ఉంచాలి

వర్కవుట్ తర్వాత ఫ్రైడ్, జంక్ ఫుడ్ తీసుకుంటే వ్యాయామ ప్రయోజనం తగ్గిపోతుంది.





# టీమిండియాకు బీసీసీఐ భారీ నజరానా

- టీ20 ప్రపంచకప్ విజేత జట్టుకు రూ.131 కోట్ల బహుమతి

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఈ నెల 8న జరిగిన ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్లో భారత జట్టు న్యూజిలాండ్‌పై అద్భుత విజయాన్ని సాధించి విశ్వవిజేతగా నిలిచింది. కీలక పోరులో అన్ని విభాగాల్లో సమర్థంగా రాణించిన టీం ఇండియా చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది.

**బీసీసీఐ నుంచి రూ.131 కోట్ల భారీ బహుమతి**

ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) టీమిండియాకు రూ.131 కోట్ల భారీ నగదు బహుమతిని ప్రకటించింది. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, సెలక్టర్లు మరియు సపోర్టింగ్ స్టాఫ్ అందరి కృషిని గుర్తిస్తూ ఈ నజరానాను అందజేస్తున్నట్లు బోర్డు వెల్లడించింది.

**వరుసగా రెండోసారి టైటిల్ సాధించిన భారత్**

ఈ విజయంతో టీం ఇండియా వరుసగా రెండోసారి టీ20 ప్రపంచకప్ ట్రోఫీని నిలబెట్టుకుంది. గత ఎడిషన్ విజయానంతరం మరోసారి టైటిల్‌ను కైవసం చేసుకుని ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని మరింత బలపరిచింది.

**టీ20 చరిత్రలో కొత్త రికార్డు**

ఈ టైటిల్‌తో టీ20 ప్రపంచకప్ చరిత్రలో మూడుసార్లు విజేతగా నిలిచిన తొలి జట్టుగా భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. పొట్టి ఫార్మాట్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో భారత్ తన స్థానాన్ని మరింత బలపరిచిందని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**జట్టును అభినందించిన బీసీసీఐ**

ఈ చారిత్రాత్మక విజయానికి కారణమైన ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, సపోర్ట్ స్టాఫ్ అందరికీ బీసీసీఐ గౌరవ కార్యదర్శి దేవాజిత్ సైకియా అభినందనలు తెలిపారు. దేశానికి గర్వకారణమైన ఈ విజయాన్ని గుర్తిస్తూ ఈ భారీ బహుమతిని ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు.

# ఐపీఎల్ 2026 షెడ్యూల్‌పై బిగ్ అప్‌డేట్..

**మార్చి 12న 20 రోజుల షెడ్యూల్ విడుదల**

క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు సంబంధించిన కీలక అప్‌డేట్ బయటకు వచ్చింది. లీగ్ ప్రారంభానికి సంబంధించిన తొలి 20 రోజుల షెడ్యూల్‌ను మార్చి 12న విడుదల చేయనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మొత్తం టోర్నీ షెడ్యూల్‌ను ఒకేసారి ప్రకటించడం కష్టమవుతోందని ఆయన చెప్పారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం రాష్ట్రాల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత మిగతా మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని వెల్లడించారు. మొదటగా ఐపీఎల్ 2026ను మార్చి 26న ప్రారంభించాలని భావించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల రెండు రోజుల వాయిదా పడింది. ఇప్పుడు టోర్నీ మార్చి 28న ప్రారంభమై, మే 31న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది. సాంప్రదాయం ప్రకారం గత సీజన్ విజేతలు, రన్నరప్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగుతుంది. ఈ లెక్కన ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్ జట్లు ఓపెనింగ్ మ్యాచ్ ఆడే అవకాశముంది. అయితే ఇటీవల విడుదలైన ఒక పోస్టర్ కారణంగా సీఎస్‌కే, రాజస్థాన్ రాయల్స్ మధ్య తొలి మ్యాచ్ జరగొచ్చనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై పూర్తి స్పష్టత షెడ్యూల్ విడుదలైన తర్వాతే తెలుస్తుంది.





# ఇక్కడితో ఆగం.. 300 పరుగులే లక్ష్యం: గంభీర్

టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆటగాళ్లకు కీలక సూచనలు చేశాడు. ట్రోఫీ గెలిచిన ఆనందంలో తేలిపోకుండా మరింత కష్టపడాలని సూచించాడు. ఈ విజయాన్ని అంతిమ గమ్యంగా కాకుండా, కొత్త ప్రయాణానికి ఆరంభంగా భావించాలన్నారు. టీ20 ఫార్మాట్‌లో భారత జట్టు ఇంకా దూకుడుగా ఆడాలని, భవిష్యత్తులో 300 పరుగుల మైలురాయిని కూడా అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించాడు. "మేం ఇంకా 300 పరుగుల మార్క్‌ను చేరలేదు. కానీ ఒక రోజు అది కూడా సాధిస్తాం. టీం మరింత నిర్దాక్షిణ్యంగా ఆడాలి" అని గంభీర్ వ్యాఖ్యానించాడు. టోర్నీలో సంజూ ఆడిన దూకుడు ఇన్నింగ్స్‌లు జట్టుకు మరింత ఆత్మవిశ్వాసం ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు.

**2027 వన్డే వరల్డ్‌కప్ కోసం ముందస్తు ప్రణాళిక**

ఇక వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ కోసం కూడా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలని గంభీర్ వెల్లడించాడు. ఐపీఎల్ 2026 ముగిసిన వెంటనే 2027 ప్రపంచకప్‌కు సంబంధించిన బ్లూప్రింట్ రూపొందిస్తామని చెప్పాడు. "ఐపీఎల్ తర్వాత వన్డే ప్రపంచకప్ జరిగే వరకు సుమారు 25 నుంచి 30 వన్డే మ్యాచ్‌లు ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఈ ఫార్మాట్‌లో ఎక్కువ మ్యాచ్‌లు ఆడటం లేదు. కాబట్టి ముందుగానే ప్రణాళిక సిద్ధం చేయడం అవసరం" అని వివరించాడు.


**సౌతాఫ్రికా పరిస్థితులకు తగ్గట్టు జట్టు**

2027 వన్డే ప్రపంచకప్‌కు సౌతాఫ్రికా ఆతిథ్యం ఇవ్వనుంది. అక్కడి పరిస్థితుల్లో ఆడటం అంత సులభం కాదని గంభీర్ పేర్కొన్నాడు. కాబట్టి ఆ పరిస్థితులకు సరిపోయే ఆటగాళ్లను ఎంపిక చేసి సరైన జట్టు కాంబినేషన్లు సిద్ధం చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ బాధ్యత సెలెక్టర్లు, కోచ్‌లపై ఉంటుందని పేర్కొంటూ, ఐపీఎల్ 2026 ముగిసే సమయానికి ప్రపంచకప్ ప్రణాళిక సిద్ధం చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశాడు.



# అర్ష్‌దీప్‌కు ఐసీసీ షాక్.. మిచెల్‌పై బంతి విసిరినందుకు జరిమానా

2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా భారత ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ వైపు బంతి విసిరిన ఘటనకు సంబంధించి అతను ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు తేలడంతో జరిమానా విధించింది. ఐసీసీ వెల్లడించిన వివరాల ప్రకారం, అర్ష్‌దీప్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా అతని ఖాతాలో చేర్చింది. అంతర్జాతీయ మ్యాచ్ సమయంలో ఆటగాడి వైపు ప్రమాదకరంగా లేదా అనుచితంగా బంతి విసరడం ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.9 ఉల్లంఘనగా పరిగణిస్తారని పేర్కొంది. ఈ డీమెరిట్ పాయింట్ వచ్చే 24 నెలల పాటు అమల్లో ఉంటుంది. మ్యాచ్‌లో 11వ ఓవర్లో ఈ ఘటన చోటుచేసుకుంది. అర్ష్‌దీప్ బౌలింగ్‌లో డారిల్ మిచెల్ రెండు సిక్సర్లు కొట్టిన తర్వాత మరో షాట్ ఆడగా, అర్ష్‌దీప్ బంతిని అతని వైపు విసిరాడు. ఆ బంతి మిచెల్ పాదాన్ని తాకడంతో అతను అసహనం వ్యక్తం చేశాడు. అంపైర్లు మరియు భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పరిస్థితిని చల్లబరిచారు. అనంతరం అర్ష్‌దీప్ మిచెల్‌కు క్షమాపణలు చెప్పాడు.




# రిటైర్మెంట్ దిశగా ఐదుగురు స్టార్ క్రికెటర్లు

2026 టీ20 ప్రపంచకప్ ఉత్కంఠభరితంగా ముగిసిన తర్వాత క్రికెట్ ప్రపంచంలో కొత్త మార్పులపై చర్చ మొదలైంది. భారత్ టైటిల్ గెలిచిన ఆనంద వేడుకల మధ్య, ఈ టోర్నమెంట్ కొంతమంది దిగ్గజ ఆటగాళ్లకు అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో చివరి అధ్యాయంగా మారే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. వయస్సు, ఫామ్‌లో మార్పులు, కొత్త ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనల నేపథ్యంలో పలువురు స్టార్ క్రికెటర్లు రిటైర్మెంట్ వైపు అడుగులు వేయవచ్చని చర్చ సాగుతోంది. పాకిస్థాన్ స్టార్ బ్యాట్స్‌మన్ బాబర్ ఆజం ఇటీవలి కాలంలో తన స్ట్రైక్‌రేట్, జట్టులో పాత్రపై విమర్శలను ఎదుర్కొంటున్నారు. ప్రపంచకప్‌లో జట్టు ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయకపోవడంతో ఆయన టీ20 అంతర్జాతీయాలకు వీడ్కోలు చెప్పి టెస్టులు, వన్డేలపై దృష్టి పెట్టే అవకాశముందని చెబుతున్నారు. అలాగే భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా 35 ఏళ్ల వయస్సులో టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం ఉంది. భారత్‌ను ప్రపంచకప్ విజేతగా నిలిపిన తర్వాత యువ ఆటగాళ్లకు అవకాశమివ్వాలని ఆయన భావించవచ్చని అంచనా. ఇక ఇంగ్లాండ్‌కు చెందిన లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ ఇప్పటికే 38 ఏళ్లకు చేరుకున్నాడు. రెండు ప్రపంచకప్ విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆయన త్వరలో టీ20 ఫార్మాట్ నుంచి తప్పుకునే అవకాశముంది. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ (37) కూడా అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు చెప్పి ప్రపంచవ్యాప్తంగా లీగ్‌ల్లో ఆడే దిశగా ఆలోచిస్తున్నట్టు సమాచారం. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ దిగ్గజ ఆల్‌రౌండర్ మహ్మద్ నబీ (41) ఈ ప్రపంచకప్ తన చివరి టోర్నమెంట్ కావచ్చని ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. ఆయన రిటైర్మెంట్‌తో ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్‌లో ఒక గొప్ప యుగం ముగిసే అవకాశముంది.

# పెళ్లిపీటలెక్కనున్న కుల్‌దీప్ యాదవ్.. ఎప్పుడంటే..

టీమ్‌ఇండియా క్రికెటర్ కుల్‌దీప్ యాదవ్ టీ20 వరల్డ్ కప్ దృష్ట్యా తన వివాహాన్ని వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం మెగా టోర్నీ ముగిసింది. ఈ నేపథ్యంలో కుల్‌దీప్ యాదవ్ వివాహం వన్షికతో మార్చి 14న ఉత్తరాఖండ్‌లోని ముస్సోరి రిసార్ట్‌లో జరగనుంది. దీనికి బీసీసీఐ అధికారులు, ప్రస్తుత, మాజీ ఇండియన్ క్రికెటర్లు హాజరయ్యే అవకాశముంది. రిసెప్షన్ మార్చి 17న లఖ్‌నవూలో జరగనుంది. కుల్‌దీప్, వన్షికకు గత సంవత్సరం జూన్ 4న నిశ్చితార్థం జరిగింది. ఆమె కుల్‌దీప్ చిన్ననాటి స్నేహితురాలు. ఆమె తండ్రి ఎల్.ఐ.సి.ఉద్యోగి. నిజానికి ఈ వివాహం గత సంవత్సరం నవంబర్‌లోనే జరగాల్సి ఉంది. కానీ టీ20 వరల్డ్ కప్ నేపథ్యంలో వాయిదా పడింది. కుల్‌దీప్ యాదవ్ తండ్రి.. రామ్‌సింగ్ యాదవ్ మార్చి 8న ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను వ్యక్తిగతంగా కలిసి తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
11.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## అక్కడి నుంచి తిరిగి వస్తాననుకోలేదు..
### యుద్ధ భయంలో ఊర్వశి

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కువైట్‌లో చిక్కుకున్న బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా ఎట్టకేలకు సురక్షితంగా భారత్‌కు చేరుకుంది. వృత్తిపరమైన పనుల కోసం కువైట్ వెళ్లిన ఆమె అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో వెంటనే స్వదేశానికి తిరిగి వచ్చింది. విమానం ఎక్కే సమయంలో భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్న వీడియోను ఆమె సోషల్ మీడియాలో పంచుకోవడంతో అది వైరల్‌గా మారింది. విమానం ఎక్కే వరకు బాగానే ఉన్నానని, కానీ సీట్లో కూర్చోగానే ఒక్కసారిగా భయం పట్టుకుందని ఊర్వశి తెలిపింది. గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభమై తాను అక్కడి నుంచి తిరిగి వస్తానో లేదో అనిపించిందని చెప్పింది. సురక్షితంగా ఇంటికి చేరాలని ప్రార్థించమని అభిమానులను కోరింది. తీవ్ర ఉద్రిక్తతల మధ్య చివరకు ఊర్వశి ముంబై చేరుకుంది. కారులో ప్రయాణిస్తున్న వీడియోను పోస్ట్ చేస్తూ తాను సేఫ్ అని తెలిపింది. దీంతో ఆమె అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఆమె భావోద్వేగ వీడియో నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.





## అవతార్ 4'పై స్పందించిన జేమ్స్ కామెరూన్

'అవతార్' సినిమాతో ప్రపంచ సినీ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసిన దర్శకుడు జేమ్స్ కామెరూన్ ఈ ఫ్రాంచైజీపై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే మూడు భాగాలు విడుదలైన ఈ సిరీస్‌లో మొత్తం ఐదు సినిమాలు ఉంటాయని ఆయన ముందే ప్రకటించారు. అయితే మొదటి భాగంతో పోలిస్తే తర్వాత వచ్చిన సినిమాలు విజువల్స్‌తో మెప్పించినప్పటికీ కథాబలం కొంత తగ్గిందన్న అభిప్రాయం ప్రేక్షకుల్లో వ్యక్తమైంది. తాజాగా జరిగిన శాటర్న్ అవార్డుల వేడుకలో కామెరూన్ 'అవతార్ 4'పై స్పందించారు. నాలుగో భాగం విషయంలో ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఇప్పటివరకు వచ్చిన మూడు సినిమాలను మరోసారి సమీక్షించి, ప్రేక్షకుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని తర్వాతి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం 71 ఏళ్ల వయసులో ఉన్న కామెరూన్ ముందున్న రెండు భాగాలపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. నాలుగో, ఐదో భాగాల కథలను సిద్ధం చేసి ఒకేసారి చిత్రీకరించే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 'అవతార్ 4'ను 2029లో, 'అవతార్ 5'ను 2031లో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ప్రభాస్ విందు వెనుక కొత్త సినిమా?
### మలయాళ దర్శకుడితో భేటీ హాట్ టాపిక్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'స్పిరిట్', 'ఫౌజీ', 'కల్కి-2' వంటి సినిమాల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో ప్రభాస్ మలయాళ దర్శకుడు దింజిత్ అయ్యతన్‌తో భేటీ కావడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు, వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సమావేశం గురించి దర్శకుడు దింజిత్ అయ్యతన్ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ ప్రభాస్ ఆతిథ్యాన్ని ప్రశంసించారు. ప్రభాస్‌తో చాలా ఆసక్తికరమైన విషయాలపై చర్చ జరిగిందని, ముఖ్యంగా ఆయన తినిపించిన రొయ్యల బిర్యానీ రుచి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. తనకు గుర్తుండిపోయే అనుభవం ఇచ్చినందుకు ప్రభాస్‌కు, ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిన హోంబలే ఫిలిమ్స్ అధినేత విజయ్ కిరగందూర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇండస్ట్రీలో ప్రభాస్ ఎవరికైనా ప్రత్యేకంగా విందు ఇస్తే అక్కడ ఒక కొత్త ప్రాజెక్ట్‌కు బీజం పడుతుందని ఒక టాక్ ఉంది. ఇప్పుడు 'సలార్' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిలిమ్స్ సమక్షంలో ఈ భేటీ జరగడంతో ప్రభాస్ మరో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే చేస్తున్న సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, దింజిత్ చెప్పిన వైవిధ్యమైన కథకు ప్రభాస్ ఓకే చెప్పినట్టు నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఇద్దరూ కలిసి ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి.





## నన్ను గర్వపడేలా చేశావ్.. చిరు పుత్రికోత్సాహం

తన పెద్ద కుమార్తె సుస్మితకు అగ్ర కథానాయకుడు చిరంజీవి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెతో ఉన్న కొన్ని అరుదైన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకుంటూ భావోద్వేగంగా స్పందించారు. సుస్మిత ఎదుగుదలను చూస్తుంటే తండ్రిగా ఎంతో గర్వంగా అనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు.

"ఒకప్పుడు నా వేలు పట్టుకుని నా పక్కనే నడిచిన చిన్నపిల్లవి నువ్వు... ఇప్పుడు బాధ్యత గల మహిళగా ఎదిగావు. నా సినిమాలు చూస్తూ పెరిగిన నువ్వే ఇప్పుడు నా సినిమాలు నిర్మించే స్థాయికి రావడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నన్ను గర్వపడేలా చేశావు" అంటూ సుస్మితపై తన ప్రేమను, గర్వాన్ని చిరంజీవి వ్యక్తం చేశారు. ఇటీవల చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రాన్ని సుస్మిత కొణిదెల నిర్మించారు. ఈ సినిమా ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.375 కోట్ల వసూళ్లు సాధించి పలు రికార్డులు సృష్టించింది. ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా నయనతార నటించగా, హీరో వెంకటేశ్ ప్రత్యేక పాత్రలో కనిపించారు. విజయవంతంగా ప్రదర్శితమవుతూ ఈ చిత్రం 109 సెంటర్లలో 50 రోజులు పూర్తి చేసుకుని నిర్మాతగా సుస్మితకు మంచి గుర్తింపును తీసుకొచ్చింది.

## గ్లామర్‌తో మెరిసిపోతున్న పూజా హెగ్డే..
## ఫొటోల్లో టైమ్‌లెస్ ఎలిగెన్స్

పాన్ ఇండియా నటి పూజా హెగ్డే తన తాజా ఫొటోలతో అభిమానులను మరోసారి ఆకట్టుకుంటోంది. ఇటీవల సోషల్ మీడియాలో పంచుకున్న ఫొటోల్లో ఆమె స్టైలిష్ లుక్స్, ఆకర్షణీయమైన చిరునవ్వు, నెమ్మదిగా వాలిన జుట్టుతో ప్రత్యేకంగా కనిపిస్తోంది. స్విమ్‌సూట్స్ నుంచి సంప్రదాయ దుస్తులు, ఆధునిక అవుట్‌ఫిట్స్ వరకు విభిన్న స్టైల్స్‌లో ఆమె మెరిసిపోతూ అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. అందమైన లొకేషన్ల మధ్య తీసిన ఈ ఫొటోల్లో పూజా హెగ్డే తన గ్లామర్‌ను సొగసుగా ప్రదర్శించింది. మెరిసే చర్మం, ఆత్మవిశ్వాసంతో కూడిన పోజులు, సింపుల్ అయినా స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో మరోసారి ట్రెండ్‌గా మారింది. అందం, స్టైల్ కలయికగా ఆమె ఫొటోలు అభిమానుల నుంచి భారీ స్పందనను అందుకుంటున్నాయి. ఇక సినిమాల విషయానికి వస్తే, 2026లో పూజా హెగ్డే వరుస భారీ ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళంలో విజయ్‌తో కలిసి నటించిన 'జన నాయకన్', రాఘవ లారెన్స్‌తో 'కాంచన 4', హిందీలో వరుణ్ ధావన్‌తో 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' వంటి చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. అలాగే తెలుగులో దుల్కర్ సల్మాన్‌తో 'డీక్యూ41' ప్రాజెక్ట్‌లో కూడా ఆమె నటిస్తోంది. ఇలా పలు భాషల్లో భారీ సినిమాలతో పూజా హెగ్డే మళ్లీ బలమైన కమ్‌బ్యాక్‌కు సిద్ధమవుతోంది.



## విజయ్‌కు మళ్లీ సీబీఐ సమన్లు

తమిళనాడులోని కరూర్‌లో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటనపై దర్యాప్తును సీబీఐ వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్‌కు మరోసారి సమన్లు జారీ చేసింది. ఈ నెల 15న ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. మొదటగా మార్చి 10న విచారణకు రావాల్సి ఉన్నప్పటికీ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉన్నానని విజయ్ కొంత గడువు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అంతే కాకుండా విచారణను చెన్నై లేదా తమిళనాడులోని ఏదైనా కార్యాలయంలో నిర్వహించాలని విజయ్ విజ్ఞప్తి చేసినప్పటికీ, సీబీఐ అధికారులు మాత్రం మార్చి 15న ఢిల్లీకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇదే కేసులో గత జనవరిలో ఆయనను అధికారులు ఇప్పటికే రెండుసార్లు ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఇదే ఘటనకు సంబంధించి కరూర్ డీఎంకే ఎమ్మెల్యే, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి కూడా సీబీఐ సమన్లు జారీ చేసింది. మార్చి 17న విచారణకు హాజరవుతానని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా తెలిపారు. 2025 సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ నిర్వహించిన భారీ బహిరంగ సభలో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది ప్రాణాలు కోల్పోగా, 60 మందికి పైగా గాయపడ్డారు. మొదట ఈ కేసును ఎస్ఐటీ దర్యాప్తు చేయగా, తర్వాత బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో సుప్రీంకోర్టు దాన్ని సీబీఐకి అప్పగించింది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com